ఏయూలో అమృత్ విజన్ ఫర్ నేషనల్ సెక్యూరిటీ సదస్సు

విశాలాంధ్ర - విశాఖ సిటీ: ఆంధ్ర విశ్వవిద్యాలయంలో మంగళవారం అమృత్ విజన్ ఫర్ నేషనల్ సెక్యూరిటీ సదస్సు నిర్వహించారు. సెంట్రల్ కమాండ్ కమాండింగ్ ఇన్ చీఫ్ జనరల్ ఆఫీసర్, లెఫ్టినెంట్ జనరల్ ఎన్.ఎస్.రాజ సుబ్రమణి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఏయూ పరిపాలనా భవనానికి విచ్చేసిన ఎస్.ఎస్. రాజ సుబ్రమణి ఏయూ ఎన్సీసీ విద్యార్థులు, రక్షణ రంగా ఉద్యోగుల గౌరవ వందనాన్ని స్వీకరించారు. వైవిఎస్ మూర్తి ఆడిటోరియం ఆవరణలో మెక్కలను నాటారు. ఏయూ స్టార్టప్, ఇంక్యుబేషన్ రంగంలో యువతను ప్రోత్సహిస్తున్న విధానం తెలుసుకుని స్వయంగా ఆ హబ్‌ను సందర్శించారు. ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాద రెడ్డి మాట్లాడుతూ ఆంధ్రవిశ్వవిద్యాలయం ఎయిర్ వార్ ఫేర్ (సికింద్రాబాద్) సీనియర్ అధికారులు డిఫెన్స్ స్టడీస్లో పీజీ కోర్సులో ప్రవేశం పొందారన్నారు. ఐఎన్ఎస్ విశ్వకర్మ, ఐఎన్ఎస్ తునీర్ (ముంబాయి), దిండిగల్ ఎయిర్ ఫోర్స్ అకాడమీలు ఏయూ గుర్తింపును కలిగి ఉన్నాయన్నారు. నూతన విద్యవిధానంలో భాగంగా ఏయూలో గత నాలుగు సంవత్సరాలుగా జరుగుతున్న అభివృద్ధి, ప్రగతిని వివరించారు.

భూ కబ్జాదారుల నుండి దేవస్థాన భూమిని కాపాడండి

కబ్జాదారులకు కొమ్ము కాస్తున్న ఆర్డీఓపై చర్యలు తీసుకోవాలి
సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి దొరబాబు

విశాలాంధ్ర బ్యూరో - అనకాపల్లి: మండలంలోని సత్యనారాయణ స్వామి దేవస్థానం విలువైన భూములను కాజేస్తున్న కబ్జాదారులపై చర్యలు తీసుకోవాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి రాజాన దొరబాబు డిమాండ్ చేశారు. కబ్జాకు గురైన 7.50 ఎకరాల భూమిని సీపీఐ బృందం మంగళవారం పరిశీలించింది. ఈ సందర్భంగా దొరబాబు మాట్లాడుతూ దేవస్థానం భూమిని కబ్జా చేసి రియల్ ఎస్టేట్ వ్యాపారులు తన వెంచర్‌కు విశాలమైన రోడ్డును ఏర్పాటు చేస్తుంటే వారికి అనకాపల్లి ఆర్డీవో చిన్నికృష్ణ సంపూర్ణ సహకారం అందించడంలో భారీ మొత్తంలో డబ్బులు చేతులు మారాయని దొరబాబు ఆరోపించారు. దేవస్థానం అధికారులు నుండి కనీసం అనుమతులు పొందకుండా రోడ్డు ఏర్పాటు చేయడం తగదన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు వియ్యపు రాజు, నరాలశెట్టి సత్యనారాయణ, సత్తిబాబు, సత్యారావు, శ్రీను, రమణ తదితరులు పాల్గొన్నారు. అలాగే సత్యనారాయణపురం పంచాయతీ శ్రీహిమగిరి శ్రీ రామలక్ష్మి సమేత సత్యనారాయణ స్వామి దేవస్థానంకు చెందిన ఖరీదైన భూములను భూ వ్యాపారులకు అప్పగించేందుకు చేస్తున్న ప్రయత్నాలను తక్షణం నిలిపేయాలని అఖిలపక్ష ప్రజాసంఘాల నాయకులు ఆర్డీవో చిన్నకృష్ణకు వినతి పత్రం అందజేశారు. కశింకోట నుండి బంగారు మెట్ట రోడ్డుకు ఆనుకొని ఉన్న సత్యనారాయణ స్వామి దేవస్థానంకు చెందిన భూములను చదును చేసి దేవస్థానం వెనుక ఉన్న రియల్ ఎస్టేట్ వ్యాపారికి దారి కల్పించడం ద్వారా కోట్ల రూపాయల స్వామివారి భూమిని భూ వ్యాపారులకు అప్పగించడం తగదని సీపీఐ అనకాపల్లి జోనల్ కార్యదర్శి వై.ఎన్.భద్రం, నాయకులు తాకాశ వెంకటేశ్వరరావు, ఆమ్ ఆద్మీ పార్టీ నాయకులు కొణితాల హరినాథ్ బాబు, బీజేపీ నాయకులు మోహన్ రావు, స్వచ్ఛంద సంస్థ నాయకులు మళ్ల చక్రవర్తి తదితరులు ఆర్డీవోకు వినతి పత్రం అందజేశారు. జరుగుతున్న పనులు నిలిపిలి చేసి దేవస్థానం వారు బోర్డును ఏర్పాటు చేయాలని లేకుంటే అఖిలపక్ష రాజకీయ పార్టీలు తరపున పనులను అడ్డగిస్తామని వారు హెచ్చరించారు.

రావులచెరువును పునరుద్ధరించాలి

విశాలాంధ్ర - కూర్మన్నపాలెం: రావుల చెరువును పునరుద్ధరించాలని వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షులు బొండా యల్లాజీరావు అన్నారు. మంగళవారం జరిగిన అత్యవసర సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వ హయాంలో వాకింగ్ ట్రాక్, ఎల్ఈడి లైట్స్, జిమ్, చిల్డ్రన్స్ పార్క్ ఏర్పాటు చేసుకొన్నామని ఇప్పుడు నిరుపయోగంగా వుందన్నారు. ఇక్కడ రాత్రి పూట మద్యం సేవించడం, మహిళలు పట్ల అసభ్య ప్రవర్తన వంటి చర్యలు మితిమీరుతున్నాయని విద్యుత్ పునరుద్ధరణ, సీసీ కెమెరాలు ఏర్పాటు చేసే చర్యలు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో గోలి జగన్, అమ్మన్న, జనార్దన్, వీర్రాజు, రమణ, వర్మ, ప్రసాద్, సీతారామరాజు, భరత్, ధనుంజయ, ప్రకాష్ పాల్గొన్నారు.

రాజ్‌మా విత్తనాలు పంపిణీలో చిలక్కొట్టుడు

విశాలాంధ్ర - అనంతగిరి: మండల పరిధిలో గల గిరి రైతులకు రాజ్‌మా విత్తనాలు సబ్సిడీపై పంపిణీ ముమ్మరంగా సాగుతుంది. అయితే వ్యవసాయ శాఖ చిలక్కొట్టుడు కొడుతున్నట్లు విమర్శలు ఉన్నాయి. నాలుగు రోజుల క్రితం వాలసి పంచాయతీలో ఈ విధమైన ఆరోపణ రాగా ఉన్నతాధికారులు దర్యాప్తు నిర్వహించారు. మంగళవారం మండల కేంద్రమైన అనంతగిరిలో రాజ్‌మా విత్తనాల పంపిణీని చేపట్టారు. 10 కిలోల రాజ్‌మా బ్యాగు 250 చొప్పున వసూలు చేశారు. అదనంగా 50 రూపాయలు వసూలు చేస్తున్నారు. అరకులోయ వ్యవసాయ శాఖ ఏడీని వివరణ కోరగా రవాణా చార్జీలతో 2 వందలకు 10 కేజీలు విక్రయించాలని అదనంగా 50 రూపాయలు వసూలు చేస్తే తప్పని సరిగా కెమికల్ కూడా ఇవ్వాలని స్పష్టం చేశారు. కానీ అనంతగిరిలో విత్తనాల పంపిణీ మాత్రమే చేయగా కెమికల్ మాత్రం మాత్రం ఇవ్వలేదు.

ఎన్ఎస్ఆర్ఐటీలో జాతీయ క్రీడా దినోత్సవం

విశాలాంధ్ర - ఆనందపురం: జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా స్థానిక శొంఠ్యాంలో గల నడింపల్లి సత్యనారాయణ రాజు ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో మంగళవారం జాతీయ క్రీడా దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. కళాశాల కార్యదర్శి డా. ఎన్.ప్రసాదరాజు మాట్లాడుతూ జాతీయ క్రీడా దినోత్సవ ప్రాముఖ్యతను వ్యాయామ విశిష్టత వాటి వలన కలిగే ప్రయోజనాలు వివరించారు. క్రీడా నైపుణ్యాలను వెలికితీసి వారి శ్రేయస్సుకి తద్వారా సమాజానికి మేలు చేసిన వారవతారని తెలియజేసారు. ఈ సందర్భంగా 24, 25, 26 తేదీలలో 6 క్రీడలలో (క్రికెట్, వాలీబాల్, కబడ్డీ, కోకో, త్రోబాల్, బాస్కెట్ బాల్) నిర్వహించగా ఈ ఈవెంట్లలో 72 టీమ్స్ పాల్గొన్నాయి. సుమారుగా 800 పైగా విద్యార్థులు ఉత్సాహంగా క్రీడలలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్, డైరెక్టర్, వ్యాయామ ఉపాధ్యాయుడు, ఇతర ఆధ్యాపక, అధ్యపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

పొంగలిపాకలో లేగదూడల ప్రదర్శన

విశాలాంధ్ర - వి.మాడుగుల: మాడుగుల మండలం పొంగలిపాక గ్రామంలో గ్రామ స్థాయి లేగ దూడల ప్రదర్శన కార్యక్రమం నిర్వహించారు. గ్రామ సర్పంచ్ నందారపు సత్యనారాయణ, ఎంపీటీసీ మైచర్ల సన్యాసినాయుడు, జిల్లా పశుగణాభివృద్ధి సంఘం ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ డాక్టర్ బి.రామ్మోహనరావు చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ ప్రదర్శనలో జెర్సీ, హెచ్ఎఫ్, ముర్రా, దేశీయ గోజాతి లేగ దూడలను జాతి లక్షణాలు, పాడి రైతుల పోషణ బట్టి మేలు జాతి లేగ దూడలను ఎంపిక చేసి బహుమతులు అందజేశారు. మొదటి బహుమతి పచ్చికూరి పరదేసినాయుడుకు, రెండవ బహుమతి కర్రి శ్రీను, మూడవ బహుమతి పొన్నాడ రామారావు, కన్సొలేషన్ బహుమతి వెల్లంకి నానాజీ, ఎర్ర రమణలకు అందజేశారు. ఈ కార్యక్రమంలో సహాయ సంచాలకులు డాక్టర్ వి.చిట్టినాయుడు, పశు వైద్యాధికారులు డాక్టర్ నరేష్, డాక్టర్ మణి లక్ష్మణ్, డాక్టర్ అరుణకిరణ్, డాక్టర్ గణేష్, వైస్ సర్పంచ్ భాస్కర్‌రావు, పశు సంవర్ధక సహాయకులు, గోపాలమిత్రులు పాల్గొన్నారు.

గొప్ప మహనీయుడు గిడుగు రామ్మూర్తి

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: తెలుగు భాషా వైభవానికి పునాదులు వేసిన మహనీయుడు గిడుగు రామ్మూర్తి అని జిల్లా కలెక్టర్ డా ఎ.మల్లికార్జున పేర్కొన్నారు. కలెక్టరేట్ సమావేశ సమావేశ మందిరంలో మంగళవారం తెలుగు భాషా దినోత్సవం పురస్కరించుకొని వాడుక భాషోద్యమ పితామహుడు గిడుగు వెంకట రామ్మూర్తి జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి జిల్లా కలెక్టర్ డా మల్లికార్జున, డిఆర్వో ఎస్.శ్రీనివాసమూర్తి, పరిపాలనాధికారి ఈశ్వరరావు, డీఎల్‌డీఓ పూర్ణిమాదేవి, సమాచార శాఖ ఆర్జేడీ వి.మణిరామ్, కలెక్టరేట్ సిబ్బంది పూలమాలలు వేసి నివాళులర్పించారు.

భీమిలి: ప్రభుత్వ జూనియర్ కళాశాలలో తెలుగు భాషా దినోత్సవం కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా గిడుగు రామ్మూర్తి పంతులు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ సిహెచ్ సూర్యప్రసాద్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరి ఉన్నతకి మాతృభాష ఎంతో దోహదపడుతుందని అన్నారు. ఈ సందర్భంగా తెలుగు వ్యవహారిక భాషా పితామహుడు గిడుగు రామ్మూర్తి జయంతి సందర్భంగా ఆయన్ని స్మరించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు దుర్గాప్రసాద్, మాధవరావు, సూరిబాబు, తెలుగు అధ్యాపకులు రామ్మూర్తి, రిటైర్డ్ ప్రిన్సిపాల్ కృష్ణారావు, విద్యార్థులు పాల్గొన్నారు.

మల్కాపురం: వ్యవహారిక భాషకు గిడుగు వెంకట రామమూర్తి పంతులు ప్రాణం పోశారని, ఆయన కృషి వల్లనే తెలుగు భాష ఇన్ని కోట్ల మందికి అందుబాటులోకి వచ్చిందని ప్రముఖ పాత్రికేయులు, చిత్రకారులు సుంకర చలపతిరావు అన్నారు. స్థానిక మల్కాపురంలోని శాఖా గ్రంథాలయంలో మంగళవారం నిర్వహించిన తెలుగు భాషా దినోత్సవంలో ఆయన మాట్లాడారు. పౌర హక్కుల సంఘం జిల్లా అధ్యక్షులు టి.శ్రీరామ్మూర్తి మాట్లాడుతూ ప్రతీ ఒక్కరూ తమిళుల వలే తమ భాష పట్ల ఆదరణ చూపాలని అన్నారు. సమావేశంలో ప్రముఖ కవి కె.సత్తిరాజు, ప్రముఖ న్యాయవాది జి.కె.వి. రాజు, జాతీయ సేవా పథకం జిల్లా ప్రోగ్రామ్ అధికారి ఇ.పి.ఎస్. భాగ్యలక్ష్మి, జాతీయ సేవా పథకం సీనియర్ ప్రోగ్రాం అధికారి వై.అనసూయా దేవి, తెలుగు ఉపాధ్యాయులు కనకమహాలక్ష్మి, ఉమ, చిత్రకారులు శంకర్, గ్రంథాలయ అధికారి వి.అజయ్ కుమార్ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే గడప-గడపకు

విశాలాంధ్ర - యస్.రాయవరం: గ్రామాల్లో సమస్యలను పరిష్కరించేందుకు గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పాయకరావుపేట ఎమ్మెల్యే గొల్ల బాబూరావు అన్నారు. మంగళవారం మండల కేంద్రం యస్.రాయవరంలో ఇంటింటికి తిరిగి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ కాకర దేవి, ఎంపీపీ కోన లోవ లక్ష్మి, ఎంపీడీఓ రామచంద్రమూర్తి, తహశీల్దార్ విజయకుమార్, స్థానిక సర్పంచ్ భూపతి అప్పారావు, ఎంపీటీసీలు బొలిశెట్టి గోవిందరావు, భైపా శ్రీనివాసరావు, వైసీపీ నాయకులు పోలిశెట్టి పెద ఈశ్వరరావు, అద్దేపల్లి నూకినాయుడు, అల్లాడ నాగరాజు, బొలిశెట్టి శ్రీనివాసరావు, లక్కోజు ఆదిమూర్తి పాల్గొన్నారు.

కృష్ణాపురం సాగునీటి కాలువకు నీరు విడుదల

విశాలాంధ్ర - పద్మనాభం: కృష్ణాపురం సాగునీటి కాలువకు మంగళవారం విశాఖపట్నం వైసీపీ రైతు విభాగం అధ్యక్షుడు ఎం.అప్పల నాయుడు నీరు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది కాలువ పూడికతీతకు రెండు లక్షల రూపాయలు సొంత నిధులు ఖర్చు చేయడం జరిగిందన్నారు. ప్రతియేటా ప్రభుత్వం నిధులు ఇచ్చి తవ్వకాలు చేసినట్లయితే 1600 ఎకరాలకు సాగునీరు అందుతుందని ఆయన అన్నారు. ఈ సందర్భంగా నీరు విడుదల పురస్కరించుకొని గంగమ్మ తల్లికి పసుపు కుంకుమల సమర్పించి రైతులకు, కూలీలకు భోజనం సౌకర్యం కల్పించారు.

నేత్రదానంపై అవగాహన అవసరం

విశాలాంధ్ర - కె.కోటపాడు: నేత్రదానంపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని, వ్యక్తి మరణానంతరం సేకరించే కళ్ళను ఇద్దరికీ చూపును ప్రసాదిస్తుందని స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రం కంటి వైద్య నిపుణులు డాక్టర్ జివి వైదేహి అన్నారు. జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో మంగళ వారం 38వ నేత్రదాన పక్షోత్సవాలు నిర్వహించారు. మనిషి చనిపోయిన ఆరు గంటల్లోగా కేవలం కార్నియా మాత్రమే తొలగిస్తారని, ఇందుకు కేవలం 20 నిమిషాల సమయం పడుతుందన్నారు. ఆసు పత్రికి వచ్చిన ప్రతి ఒక్కరికి అంధత్వ నివారణ సంస్థ ప్రచురించిన కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రమా, కంటి వైద్య సహాయ కులు ఎం.నవీన, ఎస్.మాధవి పాల్గొన్నారు.

యువగళం 200 రోజులు పూర్తి

విశాలాంధ్ర - పాయకరావుపేట: టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్ర 200 పూర్తి చేసుకున్న సందర్భంగా రాఖీ పౌర్ణమి ప్రత్యేక పూజలు స్థానిక పాండురంగస్వామి దేవాలయంలో నిర్వహించారు. యువగళం విజయవంతం కావాలని కోరారు. టిడిపి నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు మల్లవురెడ్డి రమాకుమారి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు పెదిరెడ్డి చిట్టిబాబు, పట్టణ అధ్యక్షుడు పెదిరెడ్డి శ్రీను, యాళ్ళ వరహాలబాబు, దేవవరపు వెంకట్రావు, చిక్కాల శ్రీను, బొంది కాశీవిశ్వనాద్, చింతకాయల రాంబాబు, మలిపెద్ది వెంకటరమణ, జూరెడ్డి ప్రసాద్, లెక్కల గోవిందు, దాసరి అప్పారావు, పల్లా విలియంకేరి, సూరా సుబ్రమణ్యం, వేములపూడి అప్పారావు, దువ్వి శ్రీనివాస్, ఎం.దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు

విశాలాంధ్ర - అనంతగిరి: మైనర్లు వాహనాలు నడిపితే తల్లిదండ్రులపై, వాహన యజమానిపై కేసులు నమోదు చేస్తామని ఎస్ఐ కరక రాము అన్నారు. ములియగుడ మూడు రోడ్ల జంక్షన్ వద్ద అరకు, అనంతగిరి, దుంబ్రిగుడ సర్కిల్ ఇన్స్పెక్టర్, అనతగిరి సబ్ ఇన్స్పెక్టర్ కరక రాము పోలీస్ సిబ్బంది కలసి రోడ్డు ప్రమాదాలు, వాటి నివారణ చర్యలు గురించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో బొర్రా స్టాండ్ యూనియన్ అధ్యక్షులు, డ్రైవర్లు గ్రామస్థులు, యువకులు పాల్గొన్నారు.

విదసం నేతల గృహ నిర్బంధం

విశాలాంధ్ర - పరవాడ: విశాఖ ఎన్ఐఏ కోర్టులో కోడి కత్తి శ్రీనును ప్రవేశ పెడుతున్న సందర్భంగా సిటీలోని గాంధీ విగ్రహం వద్ద మంగళవారం పెద్ద ఎత్తున ధర్నాకు విదసం ఐక్యవేదిక సమాయత్తమైంది. ఈ నేపథ్యంలో ధర్నాకు వెళ్లకుండా దేశపాత్రునిపాలెంలో విదసం నాయకులను పోలీసులు గృహ నిర్బంధం చేశారు. దీనిపై విదసం ఐక్యవేదిక కన్వీనర్ డాక్టర్ బూసి వెంకటరావు తీవ్రం ఆగ్రహం వ్యక్తం చేశారు. ధర్నా అనుమతులు ఇచ్చినట్లే ఇచ్చి రాత్రికి రాత్రే పోలీసులు వెనక్కు తీసుకోవడం బాధాకరం అన్నారు. దళితులకు ఎంత నష్టం వచ్చినా, అన్యాయం జరిగినా చట్ట పరిధిలోనే శాంతి యుతంగా ఆందోళన వ్యక్తం చేశామని, అలాంటి సంఘ నాయకులను నిర్బంధించడం అణిచి వేత ధోరణేనని అన్నారు. కోడి కత్తి శ్రీను కేసులో ముఖ్యమంత్రి కోర్టుకు హాజరు కావాలని లేదా ఎన్ఓసీ ఇవ్వాలని కోరుతూ తల పెట్టదలచిన ధర్నాకు శాంతి భద్రతల సమస్యల నెపంతో పోలీసుల అనుమతిని రద్దు చేయడం అన్యాయమన్నారు. ఇప్పటికైనా ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించి జనపల్లి శ్రీనివాసరావుకు బెయిల్ మంజూరు అయ్యేలా ప్రాసిక్యూషన్ ద్వారా తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విదసం ఐక్యవేదిక నాయకులు ఎస్ఆర్ వేమన, సోడాదాసి సుధాకర్, బూలా బాస్కరరావు, మోర మహేష్, కోల హరిబాబు తదితరులు వెంకటరావుకి సంఘీభావం తెలిపారు.

మద్యపానాన్ని పూర్తిస్థాయిలో అరికట్టండి

విశాలాంధ్ర - చోడవరం: మహిళలపై హత్యాచారాలకు కారణమవుతున్న మద్యాన్ని అరికట్టాలని ఏపీ మహిళా సమాఖ్య డిమాండ్ చేసింది. ఏపీ మహిళా సమాఖ్య మండల అధ్యక్షురాలు కనకమహాలక్ష్మి అధ్యక్షతన చోడవరంలో జరిగిన సమావేశానికి సమాఖ్య ప్రధాన కార్యదర్శి బందుల సుబ్బలక్ష్మి, అధ్యక్షురాలు బూసి పరమేశ్వరి హాజరై మాట్లాడారు. మహిళలపై జరుగుతున్న హింస, అత్యాచారం ఖండిస్తూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మహిళలను గౌరవిస్తున్నామని చెబుతూ మహిళలకు రక్షణ కల్పించలేక పోతున్నారన్నారు. మద్యపానం అరికట్టడంలో ప్రభుత్వాలు విఫలమవుతున్నాయన్నారు. మద్యం మత్తులో అత్యాచారాలు, దోపిడీలు జరుగుతున్నాయిని అన్నారు. మద్యం గొలుసు దుకాణాలు, గంజాయి, డ్రగ్స్ ఎక్కువయ్యాయన్నారు. మత్తులో ముక్కు పచ్చలారని మూడు సంవత్సరాల పసికందు మొదలు కొని 60 సంవత్సరాల వృద్ధులను కూడా వదలడం లేదన్నారు. అనంతరం చోడవరం మండల కమిటీని మహిళా సమైక్య అధ్యక్షురాలుగా గుడివాడ లక్ష్మి, కార్యదర్శిగా సోమర్ల దేవి మిగతా కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు.

ఇకో-వైజాగ్ అభివృద్ధికి కృషి: మేయర్

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: ఇకో - వైజాగ్ అభివృద్ధికి కృషి చేద్దామని నగర మేయర్ గొలగాని హరి వెంకట కుమారి అన్నారు. మంగళవారం జీవీఎంసీ, ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ సంయుక్తంగా ఆర్కే బీచ్ కాళీమాత గుడి నుండి నిర్వహించిన ఇకో - వైజాగ్ వాక్ కార్యక్రమంలో బీసీసీఐ ప్రెసిడెంట్ రోజర్ బిన్నీ, జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ మల్లికార్జున, ఇండియన్ క్రికెటర్ శ్రీకర్ భర్త్, ఏసీఏ కార్యదర్శి గోపీనాథ్ రెడ్డితో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా నగర మేయర్ మాట్లాడుతూ ఇకో - వైజాగ్ అభివృద్ధికి ప్రజా స్పందన అమోఘమని అన్నారు. కలెక్టర్ మల్లికార్జున మాట్లాడుతూ జీవీఎంసీ ప్లాస్టిక్ నిర్మూలనకు చర్యలు చేపట్టి దేశంలోనే విశాఖ ఆదర్శ నగరంగా నిలుస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ విశ్వనాథం, జీవీఎంసీ అదనపు కమిషనర్లు డాక్టర్ వై.శ్రీనివాసరావు, డాక్టర్ వి.సన్యాసిరావు, పట్టణ ప్రణాళిక అధికారి సునీత, ప్రధాన వైద్యాధికారి డాక్టర్ నరేష్ కుమార్, జోన్ల కమిషనర్లు విజయలక్ష్మి, శివప్రసాద్, సింహాచలం, మల్లయ్య నాయుడు పాల్గొన్నారు.

వక్ఫ్ బోర్డ్ నిబంధనలతోనే షాపులను కేటాయించాలి

విశాలాంధ్ర - యలమంచిలి: యలమంచిలి మున్సిపాలిటీలో గల జామియా మసీదు ఆధ్వర్యంలో కొనసాగుతున్న షాపులను వక్ఫ్ బోర్డ్ ఆదేశాలతో కేటాయించాలని యూత్ కమిటీ సభ్యులు ఎస్ కె.వల్లీ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జామియా మసీదుకు సంబంధించిన షాపులలో ఒక షాపు ఖాళీ అవ్వడంతో ఈ మధ్యనే తనకు కేటాయించాలని ప్రస్తుతం కమిటీ వారిని సంప్రదించగా కమిటి వారు షాపు కేటాయించే అధికారం తమకు లేదని వక్ఫ్ బోర్డ్‌కి లెటర్ పెట్టుకోవాలనడంతో వక్ఫ్ బోర్డ్ అధికారులకు దరఖాస్తు చేసుకున్నానని అన్నారు. ఈ ప్రక్రియ జరుగుతూ ఉండగానే మంగళవారం ఉదయానికి ఆ ఖాళీగా ఉన్న షాప్ కు కొత్తగా దుకాణ బోర్డ్‌ను ఏర్పాటు చేశారని అన్నారు. జామియా మసీదుకు ప్రజాస్వామ్య పద్ధతిలో ఎన్నికలు నిర్వహించి కమిటిని ఏర్పాటు చేయాలని గతంలో కూడా వక్ఫ్ బోర్డ్‌ను అభ్యర్థించామన్నారు. ఈ షాపుల కేటాయింపు విషయంలో వక్ఫ్ బోర్డ్ ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి పర్మిషన్ లేకుండా బోర్డ్ ఏర్పాటు చేసిన వారిపై తగు చర్యలు తీసుకోవాలన్నారు. హుస్సేన్, బషీర్, నజీర్, ఇమ్రాన్ త్వసిఫ్‌లు పాల్గొన్నారు.

రైతులకు రాజ్‌మా విత్తనాలు పంపిణీ

విశాలాంధ్ర - ముంచంగిపుట్టు: మండలంలోని కించాయిపుట్టు పంచాయతీ పెద్దాపుట్టు గ్రామంలో రైతులకు వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లా చైర్‌పర్సన్ సుభద్ర చేతుల మీదుగా మంగళవారం విత్తనాలను పంపిణీ చేశారు. రాజ్‌మా విత్తనాలను 90% సబ్సిడీపై అందిస్తుందని, పది కేజీల రాజ్‌మా చిక్కులు బస్తా 1500 రూపాయలు అయితే సబ్సిడీపై 154 రూపాయలకు అందిస్తుందన్నారు. ముంచింగిపుట్టు పరిధిలో 425 మంది రైతులు, కుమడలో 52 మంది రైతులకు విత్తనాలను మొదటిరోజు అందజేశారు. కుటుంబాలను చిన్నాభిన్నం చేసే గంజాయి వంటి పంటలకు దూరంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ అధికారి శ్రీనివాస బాబు, ఎంపీపీ అరిసెల సీతమ్మ, వైస్ ఎంపీపీలు భాగ్యవతి, పి.సత్యనారాయణ, ఎంపీటీసీ మజ్జి సుబ్బలక్ష్మి, ఎంపీటీసీ గణపతి, విజయలక్ష్మి, సర్పంచ్ వి.రమేష్, భాగ్యవతి, మండల అధ్యక్షులు మల్లికార్జున్, వైసీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి అరబీరు జగబంధు, నాయకులు తిరుపతిరావు, మండల కన్వీనర్ కొండలరావు, జగన్నాథం, కృష్ణమోహన్, తిరుపతిరావు, రాంప్రసాద్ పాల్గొన్నారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తున్న టీడీపీ నేతలపై ఫిర్యాదు

విశాలాంధ్ర - అరకులోయ: టీడీపీ జాతీయ నాయకుడు నారా లోకేష్ రాష్ట్రంలో శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తున్నారని, శాంతి భద్రతలకి విఘాతం కలిగించేలా రాష్ట్రంలో అల్లర్లు సృష్టించే విధంగా ప్రేరేపిస్తున్నారని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అల్లూరి జిల్లా కో-కన్వీనర్ మొసియ రంజిత్ కుమార్, అరకు నియోజకవర్గ సోషల్ మీడియా కన్వీనర్ పాంగి నరసింహారావులు మంగళవారం అరకులోయ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. మూడు రోజుల క్రితం, అంతకుముందు కూడా లోకేష్ చేస్తున్న పాదయాత్రలో 2019 ఏడాది నుండి 2024 సంవత్సరం వరకు ఏ టీడీపీ కార్యకర్త మీద ఎక్కువ కేసులు ఉంటాయో వారికి నామినేటెడ్ పదవులు ఇస్తామని తెలుగుదేశం పార్టీ కార్యకర్తలను రెచ్చగొట్టే విధంగా మాట్లాడుతున్నారన్నారు. నారా లోకేష్, తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు, టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు కింజరాపు అచ్చం నాయుడులపై, అలాగే రెచ్చగొట్టే ప్రసంగాలు చేసేవారి మీద తగిన చర్యలు తీసుకోవాలని కోరుతూ అరకు అడిషనల్ ఎస్ఐ జి.కుమార్‌కు ఫిర్యాదు పత్రాన్ని సమర్పించారు.

కమనీయంగా నిత్య కళ్యాణం

విశాలాంధ్ర - సింహాచలం: దేశ, విదేశాలతో పాటు ఉత్తరాంధ్ర ఆరాధ్య దైవం శ్రీ వరాహలక్ష్మీ నృసింహ స్వామివారి ఆర్జిత సేవలు ఏఈఓ సూర్య భ్రమరాంబ, పర్యవేక్షకులు సునిల్ ఆధ్వర్యంలో కమనీయంగా జరిగాయి. అర్చకులు, వేద పండితులు వేకువ జామున స్వామిని సుప్రభాత సేవతో మేల్కొలిపి ప్రాతఃకాల పూజలు సాంప్రదాయ బద్దంగా నిర్వహించారు. ప్రత్యక్షంగా, పరోక్షంగా స్వామి వారి ఆర్జిత సేవలలో పాల్గొన్న భక్తులు తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

వైభవంగా మంగళగౌరి వ్రతాలు

విశాలాంధ్ర - గొలుగొండ: గొలుగొండ మండలం పాతకృష్ణదేవిపేట గ్రామంలో శ్రీ సత్యసాయి మందిరంలో శ్రావణమాసం పురస్కరించుకొని మంగళగౌరి పూజలు వైభవంగా నిర్వహించారు. వేద పండితునిచే కుంకుమ పూజలు జరిపారు. కార్యక్రమంలో సత్యసాయి సేవాదళ్ సభ్యులు పాల్గొన్నారు.

గీతంలో నార్త్ కరోలినా వర్సిటీ బృందం

విశాలాంధ్ర - మధురవాడ: అమెరికాలోని ప్రముఖ విశ్వవిద్యాలయాలలో ఒకటైన నార్త్ కరోలినా విల్మింగ్టన్ విశ్వవిద్యాలయం నిపుణుల బృందం మంగళవారం గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయాన్ని సందర్శించింది. గీతం కెరీర్ గైడెన్స్ సెంటర్ విద్యార్థులతో ఏర్పాటు చేసిన ముఖాముఖి కార్యక్రమంలో నార్త్‌కరోలినా అంతర్జాతీయ సంబంధాల విభాగం అసోసియేట్ ప్రోవస్ట్ డాక్టర్ మైఖేల్ విలిహెమ్, అసోసియేట్ డీన్ డాక్టర్ నివీన్ రిచి పాల్గొని ప్రసంగించారు. తమ విశ్వవిద్యాలయంలో నిర్వహిస్తున్న వివిధ కోర్సులు, బోధన, పరిశోధన విధానాలను వారు వివరించారు. గీతం కెరీర్‌గైడెన్స్ సెంటర్ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ బి.రవికాంత్ గీతంలో విద్యార్థులకు జిసిజిసి ద్వారా అందిస్తున్న సేవలను వివరించారు.

సత్యవరం-మాసాహెబ్‌పేట రోడ్డు పనులు ప్రారంభం

విశాలాంధ్ర - పాయకరావుపేట: ఎట్టకేలకు మండలంలోని సత్యవరం - మాసాహెబ్‌పేట రోడ్డు పనులు ప్రారంభమయ్యాయని మాసాహెబ్‌పేట ఎంపిటిసి కొంతం నరేష్ తెలిపారు. గత 30ఏళ్లుగా రోడ్డుకు ఎటువంటి మరమ్మతులు, నిర్మాణాలు జరగలేదన్నారు. రోడ్డు నిర్మాణంతో సుమారు 30ఏళ్ల నాటి ప్రజల కల నెరవేరుతుందని తెలిపారు. సుమారు 1.1కిలోమీటర్ల పొడవున రూ.1.1 కోట్లతో సిసి రోడ్డు నిర్మిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటివరకు గతుకుల రోడ్డుతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పద్దారని తెలిపారు. నిధులు మంజూరు చేయించిన ఎమ్మెల్యే గొల్ల బాబూరావుకు, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ చిక్కాల రామారావుకు కృతజ్ఞతలు తెలిపారు.

వైసీపీలో చేరిన మాజీ జెడ్పీటీసీ

విశాలాంధ్ర - కశింకోట: కశింకోట మాజీ జెడ్పీటీసీ మలసాల ధనమ్మ, ఆమె భర్త విశాఖ డెయిరీ డైరెక్టర్ రమణారావు, వారి కుమారుడు భరత్ కుమార్ టీడీపీ నుంచి వైసీపీలోకి చేరారు. వీరు తాడేపల్లిలో ముఖ్య మంత్రి జగన్మోహన్ రెడ్డి సమక్షంలో వైసీపీ తీర్థం పుచ్చుకున్నారు. వారికి కండువాలు వేసిన ముఖ్యమంత్రి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో ఉత్తరాంధ్ర వైసీపీ కోఆర్డినేటర్ వైవి సుబ్బారెడ్డి, మంత్రి గుడివాడ అమర్నాథ్, అనకాపల్లి జిల్లా వైసీపీ అధ్యక్షులు బొడ్డేడ ప్రసాద్ పాల్గొన్నారు.

శ్రీ ప్రకాష్‌లో తెలుగు, క్రీడా దినోత్సవ వేడుకలు

విశాలాంధ్ర – పాయకరావుపేట: గిడుగు వెంకట రామ్మూర్తి పంతులు 161వ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని జరుపుకున్న తెలుగు భాషా దినోత్సవ, జాతీయ క్రీడా దినోత్సవ వేడుకలు స్థానిక శ్రీప్రకాష్ విద్యాసంస్థలో ఘనంగా నిర్వహించారు. ఈకార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సాహితీవేత్త రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ కార్యకర్త మహమ్మద్ అబ్దుల్ అజీజ్, తెలుగు విశ్రాంత ఉపాధ్యాయులు యాజ్ఞవల్క శర్మ, విద్యా సంస్థల హెచ్ఆర్ డైరెక్టర్ వివిఎస్‌బి బంగార్రాజు పాల్గొన్నారు. తెలుగు భాషా దినోత్సవాన్ని పురస్కరించుకొని విద్యార్థులకు బాల గేయాలు, చిత్రలేఖనం, చిత్రాల పరిశీలన, క్విజ్, పద్యపఠనం తదితర పోటీల్లో గెలు పొందిన విద్యార్థులకు, జాతీయ క్రీడా దినోత్సవాన్ని నిర్వహించిన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం డి.శ్రీనివాస్, అవర్ణ తదితరులు పాల్గొన్నారు.

సోంబాబుకు అభినందనలు

విశాలాంధ్ర – విశాఖ: ఇంటర్నేషనల్ మాస్టర్స్ అథ్లెటిక్స్ ఛాంపియన్ షిప్ లో గ్రేటర్ విశాఖ 46వ వార్డు కస్తూరి నగర్ 1కి చెందిన ఉమ్మిడి సోంబాబు పతకాన్ని గెలుపొందారు. ఈ పోటీలు ఈనెల 19న శ్రీకాకుళంలోని దియా గ్రామంలో ముగిసాయి. ఉమ్మిడి సోంబాబు హెయిర్ త్రోలో కాంస్యం సాధించారు. పోర్టు ట్రాఫిక్ విభాగంలో క్రేన్ ఆపరేటర్ గా ఆయన పనిచేస్తున్నారు. పూర్తి చైర్మన్ డాక్టర్ అంగముత్తు, ఏఐటియుసి నాయకులు బి సి హెచ్ మసీన్ ఆయనకు ఈ సందర్భంగా అభినందనలు తెలిపారు.

ఈవీఎం గోదామును కలెక్టర్ తనిఖీ

విశాలాంధ్ర – విశాఖ కలెక్టరేట్: చిన గదిలిలో ఉన్న ఈవిఎం గోదామును జిల్లా కలెక్టర్ డా ఏ మల్లికార్జున మంగళవారం తనిఖీ చేసారు. ఈవిఎం గోదాము తనిఖీలో భాగంగా ఈవిఎం లు భద్రపరచిన గోదామును, గార్డ్ రిజిష్టర్‌ను, సిసి టీవీ పనితీరును జిల్లా కలెక్టర్ పరి శీలించారు. భద్రత చర్యలు కట్టుదిట్టంగా ఉండాలని పోలీస్ సిబ్బందిని కలెక్టర్ ఆదేశించారు. ఆర్డీవో భాస్కర్ రెడ్డి, ఎలక్షన్ సిబ్బంది, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

వ్యాధుల పట్ల అప్రమత్తంగా వ్యవహరించాలి

విశాలాంధ్ర – అనంతగిరి: భీమవరం వైద్య సిబ్బందికి ఎంపీపీ శెట్టి నీలవేణి సూచన వర్షాకాలం వచ్చిన నేపథ్యంలో గిరిజన గ్రామాల్లో అంటు రోగాలు ప్రబలకుండ ముందస్తు జాగ్రత్తలు చేపట్టాలని అలాగే వ్యాధిగ్రస్తులకు తక్షణ వైద్య సేవలు అందించాలని భీమవరం వైద్య సిబ్బందికి అనంతగిరి ఎంపీపీ శెట్టి నీలవేణి సూచించారు. ఆమె గుమ్మకోట పంచాయతీ భీమవరం పిహెచ్‌సిని మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రికి వచ్చిన రోగులతో మాట్లాడి వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. భీమవరం పిహెచ్‌సి పరిధిలో మలేరియా కేసులు అధికంగా నమోదవుతున్న నేపథ్యంలో ప్రజలు అవగాహన కల్పించడంతోపాటు తక్షణ వైద్య సేవలను అందించాలని సూచించారు. పిహెచ్‌సి పనితీరును డాక్టర్ శ్రీనివాస్ అనూప్‌తో చర్చించారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది దాలన్న దొర, నందయ్య తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గ సమస్యలపై ఎమ్మెల్యేకి వినతిపత్రం

విశాలాంధ్ర – యస్.రాయవరం: పాయకరావుపేట నియోజకవర్గంలో సంవత్సరం పరిష్కరించాలంటూ స్థానిక ఎమ్మెల్యే గొల్ల బాబురావుకు సిపిఎం ఆధ్వర్యంలో బృందం సభ్యులు వినతిపత్రం అందజేశారు. మంగళవారం మండలంలో కొరుప్రోలు గ్రామంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలోని ఎమ్మెల్యేని కలిసి సమస్యలు పరిష్కరించాలని పలు విషయాలు వివరించారు. ముఖ్యంగా నియోజకవర్గంలో నక్కపల్లి కేంద్రంగా ఉన్న ప్రభుత్వ ఆసుపత్రిలో ట్రామా కేర్ సెంటర్, డిగ్రీ కళాశాలకు సొంత భవనాల నిర్మాణం సముద్ర తీరాల్లో జెట్టీల నిర్మాణం, వరహానది సోమదేవపల్లి ధర్మవరం వద్ద గ్రోయిన్ నిర్మాణం చేపట్టాలని వివరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు ఎం.అప్పలరాజు, ఎం.సత్యనారాయణ, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

కేఎస్ఎస్ బలోపేతానికి కృషి చేయాలి



విశాలాంధ్ర – యలమంచిలి: యలమంచిలి పట్టణంలో మంగళవారం కాఫీ విత్ కాపు కార్యక్రమాన్ని కాపు సంక్షేమ సేన (కే.ఎస్.ఎస్) యలమంచిలి మండల శాఖ అధ్యక్షులు కొఠారు నరేష్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో కే.ఎస్.ఎస్ బలోపేతానికి కృషి చేయాలని నిర్ణయించుకున్నారు. త్వరలో మండల కమిటీలను, గ్రామ కమిటీలను ఏర్పాటు చేయాలని నిర్ణయించుకున్నారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు నగిశెట్టి గంగబాబు, కార్యదర్శి నక్కా శివశంకర్, జిల్లా కార్యవర్గ సభ్యులు అడపా శేషగిరిరావు, ఆకుల వెంకటేష్, యాదగిరి గోవిందు, కొఠారు గణపతి, అల్లూరపు అచ్యుతరావు, మారెడ్ల జోసఫ్ కుమార్, వజ్రపు నాగేశ్వరరావు, గోపిశెట్టి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కిడ్నీ బాధితురాలికి జనసేన ఆర్థిక సాయం

విశాలాంధ్ర – పరవాడ: జీవీఎంసీ 77వ వార్డు పరిధి అప్పికొండ గ్రామానికి చెందిన ముత్తి ఈశ్వరమ్మ గత కొంతకాలంగా కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతూ ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. ఆమె కుటుంబం ఆర్థికంగా చాలా ఇబ్బందుల్లో ఉన్న నేపథ్యంలో స్థానిక జన సైనికులు ఆర్థిక సాయం చేసేందుకు నిర్ణయించారు. తలో చేయి వేసి కొంత మొత్తాన్ని సిద్ధం చేసారు. ఈ విషయాన్ని పెందుర్తి జనసేన నాయకురాలు గొన్న రమాదేవికి చెప్పడంతో ఆమె కూడా మరికొంత నగదును చేర్చి రూ.25వేలు మొత్తం చేసారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఈశ్వరమ్మను సోమవారం పరామర్శించి ఆమెకు ఆ మొత్తాన్ని గొన్న రమాదేవి చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో కొవిరి నర్సింగ్ (సర్దార్), ఎం.కమల్ హసన్, అర్జిల్లి కోదండరావు, సీహెచ్.సోమేశ్, ఎం.సోమునాయుడు తదితరులు పాల్గొన్నారు.

గొన్న కళాశాలలో జాతీయ క్రీడా దినోత్సవం

విశాలాంధ్ర – పరవాడ: జీవీఎంసీ 85వ వార్డు గొన్నవానిపాలెం గొన్న కళాశాలలో జాతీయ క్రీడా దినోత్సవంను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ముందుగా ద్యాన్ చంద్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గొన్న కళాశాల సెక్రెటరీ గొన్న హెంచంద్ నాయుడు నాయుడు మాట్లాడుతూ హాకీ క్రీడాకారుడు మేజర్ ధ్యాన్ చంద్ జయంతి రోజును(అగస్టు 29న) జాతీయ క్రీడా దినోత్సవంగా జరుపుకుంటున్నామని పేర్కొన్నారు. ధ్యాన్ చంద్ వరుసగా 1928, 1932, 1936 సంవత్సరాల్లో భారతదేశానికి ఒలింపిక్స్‌లో బంగారు పతకాలు సాధించిన గొప్ప హాకీ ఆటగాడని కొనియాడారు. ఇందులో భాగంగా పలు క్రీడా పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ పి.ఎస్.ఎన్ మూర్తి, ఆచార్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బాల్యవివాహాన్ని అడ్డుకున్న ఐసీడీఎస్ అధికారులు

విశాలాంధ్ర – మాకవరపాలెం: మాకవరపాలెం మండలం పైడిపాల గ్రామంలో జరుగుతున్న బాల్యవివాహాన్ని మంగళవారం నర్సీపట్నం ఐసిడిఎస్ అధికారులు అడ్డుకున్నారు. ఐసిడిఎస్ సిడిపిఒ మేరీ సువార్త ఆధ్వర్యంలో సిబ్బంది వెళ్లి బాలిక తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ ఇచ్చారు. మైనర్ వివాహం వల్ల జరిగే నష్టాలను వారికి వివరించారు. మైనారిటీ తీరేంత వరకు వివాహం జరిపించవద్దని ఆమె తల్లిదండ్రులకు వివరించారు. లేనిపక్షంలో చట్టరీత్యా చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఫ్లిప్‌కార్ట్ ఫౌండేషన్ టెక్నోసర్వ్ ఎంఓయూ

విశాలాంధ్ర – విశాఖ సిటీ: ఫ్లిప్‌కార్ట్ గ్రూప్ ఆధ్వర్యంలోని ఫ్లిప్‌కార్ట్ ఫౌండేషన్, రైతు ఉత్పత్తిదారుల సంస్థలను శక్తివంతం చేయడం, వ్యవసాయ సమాజాల కోసం స్థిరమైన అవకా శాలను సృష్టించడం లక్ష్యంగా ఒక కార్యక్రమాన్ని ప్రారంభించేందుకు లాభాపేక్ష లేని ఆర్థిక అభివృద్ధి సంస్థ అయిన టెక్నోసర్వ్‌తో భాగస్వామ్యం చేసుకుంది. మెరుగైన మార్కెటింగ్, బ్రాండింగ్ మరియు ప్యాకేజింగ్ ద్వారా తమ వ్యాపార అవుట్‌పుట్‌ను మెరుగుపరచుకోవడానికి ఈ కార్యక్రమం ఎఫ్‌పీఓలకు మద్దతు ఇస్తుంది. ఈ ప్రాజెక్టును మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్‌లో 12 నెలల పాటు అమలు చేయనున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా మహారాష్ట్రలోని ఎనిమిది ఎఫ్‌పిఓలకు మరియు ఆంధ్రప్రదేశ్‌లోని నాలుగు ఎఫ్‌పిఓలకు శిక్షణ కూడా ఇవ్వనున్నారు.

మోడల్ పాఠశాలలో ఉపాధ్యాయుల కొరత

విశాలాంధ్ర – చీడికాడ: చీడికాడ మోడల్ పాఠాశాల ఉపాధ్యాయల కొరతతో కొట్టుమిట్టాడుతుందని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు డి.వెంకన్న అన్నారు. ఆగస్టు 15న రాష్ట్రంలోనే ఉత్తమ పాఠశాలగా అవార్డు అందుకోవడం సంతోషకరమైన విషయమన్నారు. కానీ ఈ పాఠశాలలో ఫిజిక్స్, హిందీ, సివిక్స్ టీచర్‌తోపాటు హాస్టల్ వార్డెన్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని అటువంటప్పుడు పిల్లలు ఎలా చదువుకుంటారని ప్రశ్నించారు. స్కూల్లో 532మంది పిల్లలు ఉన్నారని వారు త్రాగడానికి ఆర్‌ఓ ప్లాంట్ లాంటి మంచినీటి సౌకర్యం లేకపోవడం అన్యాయమన్నారు. హెల్త్‌వర్కరు కూడా లేరన్నారు. వెంటనే సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

వైభవంగా చెవిటి నూకాలమ్మ పండుగ

విశాలాంధ్ర – యస్.రాయవరం: మండలంలో గుడివాడ పంచాయతీ పరిధిలోని కొత్త పోలవరం గ్రామంలో చెవిటి నూకాలమ్మ అమ్మవారి పండుగ వైభవంగా జరిగింది. మంగళవారం ఉదయం నుంచి భక్తులు అధిక సంఖ్యలో వచ్చి అమ్మవారిని దర్శించుకుని తమ మొక్కులు తీర్చుకున్నారు. గ్రామస్తులు సహకారంతో భారీ అన్న సమారాధన చేపట్టారు. అమ్మవారిని టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి లాలం కాశీనాయుడు దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ దూళి శీను బాబు, వైస్ ఎంపీపీ చోడిపల్లి అప్పన్న, టిడిపి సీనియర్ నాయకులు వై.వినోద్ రాజు, ఎన్.వెంకటరాజు, అమలకంటి అబద్ధం, పల్లెల బుజ్జి, అల్లు నరసింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.

లైఫ్ స్టైల్ ఆటమ్ వింటర్ కలెక్షన్

విశాలాంధ్ర – విశాఖ సిటీ: ట్రెండ్‌సెట్టింగ్ జర్నీకి మార్గదర్శకత్వం వహిస్తూ, భారత దేశంలోని ప్రధాన ఫ్యాషన్ హబ్ లైఫ్‌స్టైల్ స్టోర్స్ తమ తాజా కలెక్షన్‌ను విడుదల చేస్తున్నట్లు వెల్లడించింది. క్యాంపెయిన్ లుక్‌లను క్యూరేట్ చేయడం కోసం స్టాక్‌హోమ్‌కు చెందిన స్టైలిస్ట్ తెరెజా ఒర్టిజ్ తో భాగస్వామ్యం చేసుకున్న లైఫ్‌స్టైల్, అత్యంత ఆత్రుతగా ఎదురుచూస్తున్న ఆటమ్ వింటర్ కలెక్షన్‌తో అసమానమైన శైలి, అధునాతనతతో కూడిన సీజన్‌కు వేదికను ఏర్పాటు చేసింది.

141 మంది జర్నలిస్టులకు అక్రిడిటేషన్ మంజూరు

విశాలాంధ్ర – విశాఖ కలెక్టరేట్: జిల్లాలో ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా సంస్థలలో విధులు నిర్వహించుచున్న 141 మంది జర్నలిస్టులకు సంబంధించి అక్రిడిటేషన్‌లు మంజూరు చేసినట్లు జిల్లా కలెక్టర్, జిల్లా అక్రిడిటేషన్ కమిటీ చైర్మన్ డా.ఎ.మల్లిఖార్జున తెలిపారు. కలెక్టర్ ఛాంబర్‌లో డిఎంఎసి అధ్యక్షతన జిల్లా అక్రిడిటేషన్ కమిటీ మూడవ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటి వరకు మొత్తం 636 కార్డులు మంజూరు చేయడం జరిగిందని తెలిపారు. ఇప్పటి వరకు ఆన్‌లైన్ ద్వారా ధరఖాస్తు చేయని అర్హులైన జర్నలిస్టులు ధరఖాస్తులను సెప్టెంబర్ 30 లోగా జిల్లా పౌర సంబంధాల కార్యాలయానికి అందజేయాలన్నారు. జిల్లాలో అక్రిడిటేషన్ గల జర్నలిస్టులందరూ వారి కుటుంబ సభ్యుల ఆరోగ్య సంరక్షణ పథకం వర్కింగ్ జర్నలిస్ట్ హెల్త్ స్కీమ్ నకు సంబంధించిన దరఖాస్తులను వెంటనే ఉప సంచాలకులు, జిల్లా సమాచార పౌర సంబంధాల కార్యాలయానికి అందజేయాలని ఆయన అన్నారు. ఈ సమావేశంలో కమిటీ సభ్యులు రాఘవేంద్రరెడ్డి, ఎన్ శ్రీనివాస్, ఎం.చిట్టిబాబు కార్మిక శాఖ అసిస్టెంట్ కమిషనర్ ఎస్.మోహనలక్ష్మి, జనరల్ మేనేజరు ఆర్టీసీ, కన్వీనర్ వి.మణిరామ్ తదితరులు పాల్గొన్నారు.

కంటైనర్ టెర్మినల్ వద్ద మత్స్యకారుల ఆందోళన

విశాలాంధ్ర బ్యూరో – విశాఖపట్నం: విశాఖ ఫిషింగ్ హార్బర్ వద్ద ఉన్న కంటైనర్ టెర్మినల్ (వీసీటీ) వద్ద మత్స్యకారులు ఆందోళన చేపట్టారు. టెర్మినల్ నిర్మాణానికి తమ భూములు అప్పగించిన సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చాలంటూ ధర్నాకు దిగారు. దీంతో అక్కడ భారీగా పోలీసులు మోహరించారు. 2002లో కంటైనర్ టెర్మినల్ ఏర్పాటు సమయంలో ఒక్కో కుటుంబానికి 60 గజాల ఇంటి స్థలం, రూ.లక్ష పరిహారం, ఇంటికో ఉద్యోగం ఇస్తామని హామీ ఇచ్చారని, వాటిని అధికారులు నెరవేర్చాలని మత్స్యకారులు డిమాండ్ చేశారు. ఆందోళనకారుల ధర్నా దృష్ట్యా కంటైనర్ టెర్మినల్‌కు వెళ్లే ప్రధాన మార్గాన్ని పోలీసులు దిగ్బంధించారు. కొంతసేపు తీవ్ర ఉద్రిక్త వాతావరణం నెలకొంది.

అధికారులు హామీలు నెరవేర్చకుండా కాలయాపన చేస్తున్నారని మత్స్యకారులు పెద్ద ఎత్తున మండిపడ్డారు. మత్స్యకారుల ఆందోళనకు తెదేపా, సీఐటీయూ నేతలు మద్దతు తెలిపారు. విశాఖ పార్లమెంట్ తెలుగు యువత అధ్యక్షుడు తాతాజీ, సీఐటీయూ నేత సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రీమల ఝాన్సీరాణి ప్రమాణ స్వీకారోత్సవం

విశాలాంధ్ర – చింతపల్లి: రీమల ఝాన్సీరాణి ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమం మంగళవారం చింతపల్లిలో ఘనంగా నిర్వహించారు. టీడీపీ మండల అధ్యక్షుడు కిలో పూర్ణచంద్రరావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ ఉప ఎన్నికలలో చింతపల్లి పంచాయతీ నాలుగవ వార్డు సభ్యురాలిగా ఎన్నికైన రీమల ఝాన్సీరాణి ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమం తెదేపా శ్రేణులు నిర్వహించారు. ఝాన్సీ రాణి తన స్వగృహం నుంచి తెదేపా శ్రేణులతో కలిసి భాజా భజంత్రీల నడుమ ఊరేగింపుగా స్థానిక పంచాయతీ కార్యాలయం సచివాలయం 1కి చేరుకున్నారు. అప్పటికే ఆ కార్యక్రమానికి సంబంధించి పంచాయతీ కార్యదర్శి కే శ్రీనివాస్ ఏర్పాట్లు పూర్తి చేయడంతో స్థానిక సర్పంచ్ దురియా పుష్పలత సమక్షంలో ఝాన్సీరాణి చేత నాలుగవ వార్డు సభ్యురాలిగా కార్యదర్శి శ్రీనివాస్ ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా ఝాన్సీరాణి సర్పంచ్ దురియా పుష్పలత సహా పంచాయతీ పాలకమండలి సభ్యులను పరిచయం చేసుకున్న ఆమెకు వారు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో తెదేపా అరకు పార్లమెంట్ కార్యనిర్వాహక కార్యదర్శి చల్లంగి జ్ఞానేశ్వరి, అరకు పార్లమెంట్ బీసీ సెల్ ఉపాధ్యక్షుడు నాగభూషణం, మండల ఉపాధ్యక్షుడు ఆంద్రాబు లక్ష్మణ్, ఉపసర్పంచ్ నూరుబాబు, వైకాపా మండల కోఆప్షన్ సభ్యుడు షేక్ నాజర్ వలీ, స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ డైరెక్టర్ షేక్ మీరా, ఎంపిటిసి సభ్యురాలు చిందాడ జయలక్ష్మి, తెదేపా మైనార్టీ సెల్ నాయకుడు షేక్ ఖాసిం వల్లి, సీనియర్ నాయకురాలు బేతా నూక రత్నం, గ్రామ కమిటీ అధ్యక్షుడు రీమల ఆనంద్ దంపతులు, ఝాన్సీ రాణి కుటుంబ సభ్యులు, తెదేపా నాయకులు దూరి రామకృష్ణ, గొల్లోరి మంగు, చైతన్య, అప్పారావు పాల్గొన్నారు.

రహదారుల పేరుతో కొండలను తవ్వేస్తున్న కాంట్రాక్టర్

విశాలాంధ్ర – చోడవరం: చోడవరం మండలంలో రహదారులు మరమ్మత్తుల పేరుతో ఎటువంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా జన్నవరం గ్రామంలో అక్రమంగా గ్రావెల్ తరలిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. స్థానిక ఎమ్మెల్యే ధర్మ శ్రీ పేరుతో అక్రమంగా కొండలను తవ్వించి పగలు, రాత్రి తేడా లేకుండా గత మూడు రోజుల నుండి గ్రావెల్ తరలిస్తున్నారని, గ్రామంలో కొంత మేర రోడ్లకు గ్రావెల్ వేయగ మిగిలిన గ్రావెల్ ఎక్కడికెళుతుందో తెలియని పరిస్థితి ఏర్పడిందని గ్రామస్థులు చెబుతున్నారు. ఇంత జరుగుతున్నను, మైన్స్, విజిలెన్స్, రెవిన్యూ అధికారులు చూసి, చూడనట్లుగా వ్యవహరిస్తుండటం వెనుక అనేక అనుమానాలు తలెత్తుతున్నాయి.

ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి, ప్రకృతి సహజ సిద్ధమైన సంపదను కాపాడ వలసిందిగా స్థానికులు ప్రజా సంఘాల వారు కోరుతున్నారు. అక్రమార్కుల పై కఠిన చర్యలు తీసుకోవాలని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

గుండాల అక్రమ ఇసుక ర్యాంపుపై చర్యలు తీసుకోవాలి

విశాలాంధ్ర – ఎటపాక: గుండాల అక్రమ ఇసుక ర్యాంపుపై చర్యలు తీసుకోవాలని ఎటపాక తహశీల్దార్, సిఐకి రంపచోడవరం నియోజకవర్గం ఇంచార్జి, మాజీ టిడిపి ఎమ్మెల్యే వంతల రాజేశ్వరి వినతి అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎటపాక మండలంలోని గుండాల కాలనీలోని అక్రమ ఇసుక రీచ్ ఏర్పాటు చేసుకొని గిరిజన గ్రామం నుండి మైదాన ప్రాంతాలకు తరలిస్తున్నారని అన్నారు. నిబంధనలు ఉల్లంఘించి ఇసుక తవ్వకాలు చేపట్టి, పర్యావరణానికి తూట్లు పొడుస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎటపాక మండల అధ్యక్షులు పుట్టి రమేష్ బాబు, అరకు పార్లమెంట్ కార్య నిర్వహణ కార్యదర్శి ముప్ప శ్రీనివాస్, రాష్ట్ర తెలుగు యువత ప్రధాన కార్యదర్శి వల్లభనేని చందు, యూనిట్ ఇంచార్జ్ బాచినేని రాజేష్, మాజీ ఎంపీటీసీ సూర్యనారాయణ, మండల తెలుగు యువత అధ్యక్షులు నలజాల మధు, యూనిట్ ఇన్‌చార్జ్ చలపతిరావు, ఎస్సీ సెల్ సెక్రటరీ పసుపులేటి రాంబాబు, బానోత్ అశోక్, దామోదర్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో ఫీడర్ సేవలు విస్తృతం

విశాలాంధ్ర – హుకుంపేట: మన్యంలో మారుమూల గ్రామాల్లో ఫీడర్ సేవలు మరింత విస్తృతం చేయాలని జీవీకే గ్రీన్ హెల్త్ సర్వీసెస్ సంస్థ మూడు జిల్లాల ప్రొగ్రామ్ మేనేజర్ శ్రీనివాసు పేర్కొన్నారు. మండలంలో శోభకోట, జి.మాడుగుల మండలంలో బంధవీధి గ్రామాల్లో ఆకస్మికంగా ఫీడర్ అంబులెన్స్ సేవలు పరిశీలించి అనంతరం పాడేరు వైఎస్ఆర్ పశువర్ధక శాఖ అంబులెన్స్ 1962ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన్యంలో మారుమూల గ్రామాల్లో గిరిజనుల కు సేవలు అందించేందుకు ఏర్పాటు చేసిన సేవలను విస్తృతంగా అమలు చేయాలన్నారు. వైకాపా ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన 1962 వైఎస్ ఆర్ సంచార పశు ఆరోగ్య సేవ అం బులెన్స్ సేవలు గ్రామాల్లో రైతులు వినియోగించుకోని వారి పశువులకు వైద్య సేవలు అందించే విధంగా అవగాహనలు కల్పించి టోల్ ఫ్రీ నెంబర్ ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో అల్లూరి జిల్లా సూపర్వైజర్ గంగాధర్, ఈఎంటీలు మత్స్యరాజు, మణికంఠ, పశువైద్య సిబ్బంది సాయి, బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

అధ్వాన్న స్థితిలో మండల విద్యాశాఖ కార్యాలయం

విశాలాంధ్ర – ఆనందపురం: ఆనందపురం మండలంలో ఉన్న విద్యాశాఖ కార్యాలయం పరిస్థితి గత నాలుగున్నర సంవత్సరాలు కాలం నుంచి అభివృద్ధి అనే మాట ఇక్కడ లేదు. నాడు నేడు కార్యక్రమాల ద్వారా అయితే అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారు గాని ఎంఈఓ కార్యాలయం మాత్రం పట్టించుకోవడంలేదని వాదన బలంగా అనిపిస్తుంది. భవనం పూర్తి అధ్వానంగా ఉంది. భవనం పూర్తిగా శిథిలావస్థలో ఉండడంవల్ల వర్షాకాలంలో నీరు లోపలకు వచ్చి, పెచ్చులూడి అధ్వాన స్థితిలో ఉంది. మరుగుదొడ్లు చుట్టూ ముళ్ళపొదలు వ్యాపించి పూర్తి అధ్వాన్న స్థితిలో ఉంది. మండల విద్యాశాఖ కార్యాలయంలో అధికారులు సిబ్బందితో పాటు వందలాది మంది ఉపాధ్యాయులు నిత్యము వస్తూపోతూ ఉంటారు. విద్యార్థులకు కావలసిన సామాగ్రి ఈ భవనంలోని భద్రపరచవలసి ఉంది. బిల్డింగ్ నిర్మాణం చేసి చాలా ఏళ్లు గడుస్తున్నా స్లాబ్ పెచ్చులు ఊడి పడిపోతున్న ఈ భవనంలోని పరికారాలు బాగు చేయవలసిన ఉంది. కనీసం మరుగుదొడ్లు కూడా సక్రమంగా లేకపోవడంతో సిబ్బంది మహిళా ఉపాధ్యాయులు నిత్యం నరకయాతన పడుతున్నారు. అందువల్ల దోమలు బెడద విపరీతంగా ఇక్కడ ఉంది. ఇప్పటికైనా స్థానిక నాయకులు చొరవ చూపి శాసనసభ్యులు అవంతి దృష్టికి తీసుకొని వెళ్లి విద్యాశాఖ అధికారులు సహాయ సహకారాలతో సమస్యలను పరిష్కారం చేస్తారని విజ్ఞప్తి చేస్తున్నారు.

108లో సుఖ ప్రసవం

విశాలాంధ్ర – చోడవరం: ఆపద, అత్యవసర సమయాల్లో బాధితుల చెంతన నిలిచే 108 ఎమర్జెన్సీ వాహనంలో మంగళవారం సుఖ ప్రసవం జరగడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. వివరాల్లోకి వెళితే బుచయ్యపేట మండలం వడ్డాది కి చెందిన గర్భిణీ దుర్గాదేవిని ప్రసవం 108 వాహనంలో చోడవరం తరలిస్తున్నారు. నరసయ్య పేట గ్రామం వద్దకు వచ్చేసరికి ప్రసవ వేదనను తట్టుకోలేక పోవడంతో ఈ.ఎం.టి. చుక్క మధు పురుడు పోసి తల్లి బిడ్డను రక్షించారు. దుర్గాదేవి ఆడ బిడ్డకు జన్మనిచ్చినది. వాహన పైలట్ జి.శంకర్ సహరించగా, దుర్గాదేవి తల్లితండ్రులు, భర్త కృతజ్ఞతలు తెలిపారు.

పురందేశ్వరిని తూలనాడే అర్హత లక్ష్మీపార్వతికి లేదు

విశాలాంధ్ర – విశాఖ కలెక్టరేట్: పార్టీలో రెండో పొజిషన్ లో వుంటూ కుటిల బుద్ధితో పార్టీని కబళించాలని చూశారని, అందుకే ఎన్టీఆర్ లక్ష్మి పార్వతిని నమ్మలేదని బిజెపి రాష్ట్ర నాయకులు వీరన్న చౌదరి అన్నారు. లక్ష్మి పార్వతి నుండి తెలుగుదేశం పార్టీని ఆనాడు ఎమ్మెల్యేలు, కార్యకర్తలు కాపాడుకున్నారు. ప్రజల మన్నన లేని నాయకురాలిగా, చరిత్ర హీనురాలుగా మిగిలిపోయిన లక్ష్మీపార్వతికి పురందేశ్వరి గురించి మాట్లాడే అర్హత లేదన్నారు.

ప్రభుత్వ పెన్షనర్లు ఈకేవైసీ చేయించుకోవాలి

విశాలాంధ్ర – చోడవరం: రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్లు, కుటుంబ పెన్షనర్లు సెప్టెంబర్ 15లోగా ఈ.కె.వై.సి. నమోదు చేసుకోవాలని విశాఖ సీతమ్మధార ఉప ఖజానాధికారి డి.డి.ప్రసాదరావు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి విశాఖ జిల్లా వ్యాప్తంగా సుమారు 900 మంది పెన్షనర్లు నమోదు చేయించుకోవాలని అన్నారు. ఈకెవైసి నమోదు చేయని వారికి అక్టోబర్ నెల నుండి ఫించను నిలుపుదల చేస్తారని అధికారులు తెలియజేశారు.

లెగ్రాండ్ నుంచి 'ఆల్జీ'

విశాలాంధ్ర – విశాఖ సిటీ: ఎలక్ట్రికల్, డిజిటల్ భవన మౌలిక సదుపాయాలలో ప్రపంచంలోనే అగ్రగామి అయిన లెగ్రాండ్ ఇండియా 'ఆల్జీ'ని ప్రవేశపెట్టింది. ఇది మాస్ సెగ్మెంట్ కోసం కంటికి-ఆకర్షణీయమైన రంగులతో, మంచి డిజైన్ తో అసమాన నాణ్యతతో ఉండే భారతదేశపు కచ్చితమైన స్విచ్ శ్రేణి.ఆల్జీ కమ్యూనికేషన్ ప్రచారం భారతదేశములోని అనేక ప్రాంతాలలో హసిల్ స్పిరిట్ ను జరుపుకుంటోంది. ఈ ప్రచారము భారతీయుల మల్టీటాస్కింగ్ స్పిరిట్స్‌కు అంకితం చేయబడింది. ఆల్జీ అల్ట్రా-సాఫ్ట్-టచ్ రాకర్స్ స్విచ్ పనిచేసేటప్పుడు సంప్రదాయికంగా బిగ్గరగా ధ్వని వచ్చే క్లిక్స్ స్థానములో ఒక ధ్వని-రహిత అనుభవాన్ని అందిస్తుంది.

నిలిచిన ఆర్టీసీ బస్సు

విశాలాంధ్ర – మారేడుమిల్లి: ఎగువ సీలేరు నుండి రాజమండ్రి వెళ్తున్న ఆర్టీసీ బస్సు ఘాట్ రోడ్డులో మంగళవారం ఉదయం లారీ ఢీకొంది. దీంతో సాంకేతిక లోపం ఏర్పడింది. కొద్ది గంటలపాటు ప్రయాణికులు ఇబ్బందుల పాలయ్యారు. ప్రయాణికులు ఎవరు ప్రమాదానికి గురి కాలేదు. దీంతో ఆర్టీసీ అధికారులు ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు.

పేరంటాలమ్మ తల్లికి ప్రత్యేక పూజలు

విశాలాంధ్ర – రాజవొమ్మంగి: రాజవొమ్మంగి మండలం దూసరిపాము గ్రామస్తులు అప్పలరాజుపేట చెరువు ఒడ్డునున్న పేరంటలమ్మ తల్లికి వర్షాలు కురవాలంటూ ప్రత్యేక పూజలు నిర్వహించారు. దూసరిపాము సర్పంచ్ చీడి శివ గ్రామస్తులు సహకారంతో పూజలు చేసి అన్నదానం నిర్వహించారు. మన్యంలో ఈ సంవత్సరం సరైన వర్షాలు కురవకపోవడంతో రైతులు వర్షాల కోసం ఎదురు చూసి సర్పంచ్ సలహాతో, సహకారంతో పండుగ జరిపారు. ఈ కార్యక్రమంలో దూసరిపాము, చుట్టుపక్కల గ్రామస్తులు, డిటి సత్యనారాయణ, పాత్రికేయులు తదితరులు పాల్గొన్నారు.

ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు

విశాలాంధ్ర – కొమ్మాది: మధురవాడ చంద్రంపాలెం జాతర గట్టు శ్రీ దుర్గాలమ్మ అమ్మవారి ఆలయ ప్రాంగణంలో క్షేత్ర పాలకునిగా ఉన్న శ్రీ పంచముఖ ఆంజనేయస్వామి ఆలయంలో శోభకృత్ నామ సంవత్సరం నిజ శ్రావణ మాసం శుక్ల పక్షం త్రయోదశి మంగళవారం సందర్భంగా ప్రత్యేక పూజలు అలయ అర్చకులు పట్నాల హరి ప్రసాద్ శర్మ, హరిస్వామిలు నిర్వహించారు. ముందుగా స్వామి వారికి నిత్య పూజలతో ప్రారంభమై సుగంధ ద్రవ్య జలాభిషేకములు జరిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు పిళ్లా సూరిబాబు, నాగోతి తాతారావు, పీస రమణ, పోతిన పైడిరాజు, పిళ్లా రమణ, పిళ్లా పోతరాజు, పి.రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర

➡ విశాఖపట్నం
➡ అనకాపల్లి
➡ అల్లూరి సీతారామరాజు

బుధవారం 30, ఆగస్టు, 2023

పాఠశాలను తనిఖీ చేసిన జెడ్పీటీసీ

విశాలాంధ్ర – అనంతగిరి: అనంతగిరి మండలం కొండిభ పంచాయతీ దముకు మండల పరిషత్ పాఠశాల ఎంపిపి పాఠశాలను జడ్పిటిసి దీసరి గంగరాజు తనిఖీ చేశారు. పాఠశాల ఉపాధ్యాయురాలు లీలావతిని పాఠశాల సమస్యలపై అడిగి తెలుసుకున్నారు. పాఠశాల ప్రహరి నిర్మించాలని, బెంచిలు కావాలని, కోతుల బారి నుంచి రక్షణ కల్పించాలని జెడ్పీటీసీ దృష్టికి ఆయా సమస్యలను తీసుకువెళ్లారు. ఈ కార్యక్రమంలో గిరిజన మండల కార్యదర్శి జన్ని సుబ్బారావు ఉన్నారు.

అధ్యాపకుల పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానం

విశాలాంధ్ర – ఆనందపురం: ఆనందపురం మండలంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ తెలుగు సబ్జెక్టు -1 అధ్యాపకులు కావాలని ప్రిన్సిపాల్ ఎన్ కృష్ణవేణి తెలిపారు. వీరికి నెలకు పదివేల రూపాయలు పారితోషకం ఇవ్వబడుతుందన్నారు. ఎంఏలో 50 శాతం ఉత్తీర్ణత సాధించి అర్హత కలిగిన అభ్యర్థులు ఆగస్టు 30 ఉదయం 10 గంటలకు సర్టిఫికెట్స్‌తో జూనియర్ కళాశాలలో హాజరు కావాలని తెలిపారు.

రోడ్లు పరిశీలించిన ముమ్మన

విశాలాంధ్ర – పెందుర్తి : జీవీఎంసీ 95 వ వార్డు పాపయ్యరాజు పాలెంలో గడపగడప మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మంజూరైన రోడ్లను స్థానిక కార్పొరేటర్ ముమ్మన దేముడు మంగళవారం ఉదయం పరిశీలించారు. పాపయ్యరాజుపాలెంలో 18.17 లక్షల రూపాయలతో సీసీ రోడ్లు, కాలువలు నిర్మాణం చురుగ్గా సాగుతోంది. ఈ రోడ్లు పరిశీలించిన కార్పొరేటర్ ముమ్మన దేముడు నిర్మాణంలో నాణ్యత పాటించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జీవీఎంసీ అధికారులు ఏఈ దుర్గాప్రసాద్, వర్క్ ఇన్స్పెక్టర్ రామకృష్ణ, వైసిపి నాయకులు రోమాల నూకరాజు, కెవిఆర్, లక్ష్మీ,టి.చిన్నం నాయుడు,కృష్ణ మూర్తి పాల్గొన్నారు.

సబ్సిడీపై రాజ్మా విత్తనాలు పంపిణీ

విశాలాంధ్ర – సీలేరు: జీకే వీధి మండలం దారకొండ పంచాయతీలో సర్పంచ్ నడిగొట్ల రాజు ఆధ్వర్యంలో మంగళవారం సబ్సిడీపై రాజ్మా విత్తనాలను రైతులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు అందించడంతో పాటు రైతులను రాజుగా చూడాలన్న లక్ష్యంతో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు సబ్సిడి విత్తనాలు పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి మాడి రామన్న, అగ్రికల్చర్ అసిస్టెంట్ శ్రీదేవి, మహిళా పోలీస్ పూజారి పద్మ, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

నిస్వార్థానికి చిరునామా చురకల రమణ..!

విశాలాంధ్ర – భీమిలి: తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుండి పార్టీలో ఉంటూ, పార్టీ అభివృద్ధికి, కార్యకర్తల అభ్యున్నతికి విశిష్ట సేవలు అందించిన నిస్వార్థ రాజకీయ నాయకుడు చురకల రమణ అని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి, పెందుర్తి నియోజకవర్గం పరిశీలకులు గంటా నూకరాజు అన్నారు. భీమిలి తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో చురకల రమణ 65వ జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా విచ్చేసిన గంటా నూకరాజు ముందుగా సాలువా, పూలమాలలతో సత్కరించి కేక్ కట్ చేసిన అనంతరం మాట్లాడారు. 1982 వ సంవత్సరం నుండి తెలుగుదేశం పార్టీలోనే ఉంటూ భీమిలిలో తెలుగుదేశం పార్టీ అభివృద్ధికి ఎంతో కృషి చేశారని అన్నారు. భీమిలి మున్సిపల్ కౌన్సిలర్ గా, వుడా డైరెక్టర్ గా, జిల్లా కమిటీ సభ్యులుగా పార్టీకి ఎంతో కృషి చేశారని అన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు పెంటపల్లి యోగీశ్వరరావు, కనకల అప్పలనాయుడు, సంకురుభుక్త జోగారావు, కొక్కిరి అప్పన్న, గండిబోయిన పోలరాజు, రాజేందర్, రాజగిరి రమణ, పిల్లా తాతారావు, అప్పికొండ నూకరాజు, జలగడుగుల మురళి, సిద్దార్థ వర్మ, వాడమొదలు రాంబాబు, శ్రీనివాసరావు, అప్పికొండ నర్సింగరావు, వాసుపల్లి వంశీ, దౌలపల్లి హరీష్, తాతారావు తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో మేలు

విశాలాంధ్ర – హుకుంపేట: మన రాష్ట్రంలో ప్రకృతి వ్యవసాయంపై అధ్యయనం చేసి నేపాల్ రాష్ట్రంలో దానిని అవలంబించేందుకు మన్యంలో నేపాల్ కంట్రీ గ్రౌండ్స్వెల్ ఇంటర్నే షన్ ఎన్ జీవో తరుపున 6 సభ్యులు వచ్చారని ప్రకృతి వ్యవసాయం డీపీఎం

భాస్కరరావు పేర్కొన్నారు. మండలంలో రంగశీల, పెదగరువు, పాదిలి, మాసాడు. కుంతుర్ల మోటు జోరు గ్రామాల్లో రైతులు ప్రకృతి వ్య వసాయంతో పండించే పంటల్ని పరిశీలించారు. మొట్టుజోరు గ్రామంలో 360 రోజులు రకరకాల పంటలు పండించే రైతు వి.చైతమ్మను కలసి ఆమె వద్ద 100 రకాల విత్తనాలు చూసి అభినందించారు. నేపాల్లో ఇటువంటి వ్యవసా యం చేసేందుకు కృషి చేస్తామని వా రు తెలిపారని పేర్కొన్నారు. మన్యం లో ఈ నెల 26 నుంచి 31వరకు అధ్యాయనం చేయ నున్నట్లు తెలిపా రని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయం ఎస్ఆర్ పి దేముళ్లు, సుధాకర్, పండన్నా తది తరులు పాల్గొన్నారు.

గిరి గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

విశాలాంధ్ర – ముంచంగిపుట్టు: అల్లూరి సీతారామరాజు జిల్లా ముంచంగిపుట్టు మండలంలో గల గిరిజన గ్రామాల అభివృద్ధియే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని విశాఖ ఉమ్మడి జిల్లా చైర్పర్సన్ అరబీరు సుభద్ర అన్నారు. మంగళవారం మండలంలో గల సుజనకోట పంచాయతీ కొత్త సు జనకోట గ్రామంలో గడప గడపకు నిధులు 5 లక్షల రూపాయల వ్యయంతో సీసీ రోడ్డు నిర్మాణానికి చైర్ పర్సన్ సుభద్ర, ఎంపీపీ సీతమ్మ, స్థానిక సర్పంచ్ రమేష్ చేతులు మీదుగా భూమి పూజ కార్యక్రమం చేశారు. ఈ సందర్భంగా సుభద్ర మాట్లాడుతూ గిరిజన గ్రామాల అభివృద్ధి లక్ష్యంగా రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం ముందుకు కొనసాగుతుందని ఆమె అన్నారు. గడప గడప కార్యక్రమం లో భాగంగా సి సి రోడ్డు నిర్మాణానికి ఐదు లక్షల రూపాయలతో 120 మీటర్ల సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి సుబ్బలక్ష్మి, జర్రెల సర్పంచ్ బి భాగ్యవతి, జిల్లా వైసీపీ ప్రధాన కార్యదర్శి జగబందు, వైసిపి నేతలు కొండలరావు, అర్జున్, శివ, సురేష్, పులి రాజు, తిరుపతిరావు, మూర్తి, దామోదరం, జగన్నాధం పాల్గొన్నారు.

30 నుంచి సమరభేరీ

విశాలాంధ్ర – చింతూరు: కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు మరిన్ని భారాలు మోపుతూ నిరుద్యోగం, నిత్యవసరసరుకులు విద్యుత్, గ్యాస్‌పై అదనపు ఛార్జిలను పెంచుతూ ప్రజలపై మరిన్ని భారాలు మోపుతున్న కేంద్ర రాష్ట్ర విధానాలపై ఈనెల 30 నుంచి సెప్టెంబర్ 4 వరకు సిపిఎం రాష్ట్ర పిలుపులో భాగంగా సమరభేరి నిర్వహిస్తుందని ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రజలు పోరాటాలకు సిద్ధం కావాలని సిపిఎం మండల కమిటీ సమావేశంలో మండల కార్యదర్శి సీసం సురేష్ పిలుపునిచ్చారు. మంగళవారం సిపిఎం కార్యాలయంలో పార్టీ మండల కమిటీ సమావేశంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలపై సమరభేరి పోస్టర్‌ను ఆవిష్కరించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతి ఏడాది డీఎస్సీ ప్రకటిస్తానని, గ్రూప్ 1,2 ఉద్యోగాలు భర్తీ చేస్తానని ఎన్నికల ముందువాగ్దానం చేసిన ముఖ్యమంత్రి నాలుగు సంవత్సరాలు పూర్తయిన నేటికీ ఎలాంటి ఉద్యోగ ప్రకటన చేయలేదని అన్నారు. మండల నాయకులు పల్లపు వెంకట్, మల్లం సుబ్బమ్మ, ముట్టం రాజయ్య, పోడియం లక్ష్మణ్, కారం సుబ్బారావు, వేక,రాజ్ కుమార్, కారు నాగేష్, తదితరులు పాల్గొన్నారు.

ఎన్టీఆర్ తాచేరు రిజర్వాయర్ పూర్తి చేయాలి



విశాలాంధ్ర – వి.మాడుగుల: మాడుగుల మండలం ఎన్టీఆర్ తాచేరు రిజర్వాయర్ పనులు పూర్తి చేయాలంటూ మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామనాయుడు చేపట్టిన రైతుల నిరసన పాదయాత్ర మంగళవారం వీరవెల్లిఅగ్రహారం గ్రామంలో ప్రారంభమైంది. ఈ సందర్భంగా రామానాయుడు మాట్లాడుతూ తక్షణమే తారక రామా రిజర్వేయర్ పనులను పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం వీరవిల్లి నుంచి ముకుందపురం వంటర్లపాలెం, కేజేపురం ఎం. కోటపాడు మీదుగా పాదయాత్ర సాగింది. ఈ సందర్భంగా రామనాయుడు మాట్లాడుతూ 40 ఏళ్లుగా అసంపూర్తిగా ఉన్న మండలంలోని తారక రామా రిజర్వాయర్‌కు పూర్తి మరమ్మత్తులు చేపట్టి కాలువ ద్వారా సాగునీటిని అందించాలన్నారు. ప్రతిపక్ష ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు ఈ రిజర్వాయర్ కోసం రూ.9.35 కోట్లు మంజూరు చేయించామని, ప్రభుత్వం మారిన వెంటనే ఈ రిజర్వాయర్‌కు కేటాయించిన నిధులు పక్కదారి పట్టించారని ఆరోపించారు. తారక రామా రిజర్వాయర్ పూర్తి చేసి రైతులకు సాగునీరు అందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు మజ్జి తాతబాబు, పుప్పాల అప్పలరాజు, ఉండూరు దేముడు, సుంకర సింహాచలంనాయుడు, పాశిల నాగేశ్వరరావు, లెక్కల కాశిబాబు, వేగి రాంబాబు, పి.సూర్యనారాయణవర్మ, జిల్లా రైతు సంఘం అధ్యక్షులు గొల్లవిల్లి శ్రీరామ్మూర్తి, టీడీపీ నాయకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

గీతం ఆసుపత్రిలో నేత్రదాన వారోత్సవాలు

విశాలాంధ్ర – మధురవాడ; గీతం ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ అండ్ రీసెర్చిస్ (జిమ్‌సర్) ఆసుపత్రి మరియు వైద్య కళాశాల ఆధ్వర్యంలో జరుగుతున్న జాతీయ నేత్రదాన వారోత్సవాలలో భాగంగా మంగళవారం ఎండాడ గ్రామంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సమావేశంలో ప్రోవైస్ ఛాన్సలర్ డాక్టర్ బి.గీతాంజలి మాట్లాడుతూ దేశంలో ఏటా లక్ష మందికి కార్నియా మార్పిడి ద్వారా దృష్టి తీసుకురావలసి ఉండగా కేవలం 25 వేల కార్నియా మార్పిడి మాత్రమే సాధ్యపడుతోందన్నారు. ప్రజలలో నేత్రదానం పట్ల అవగాహన పెంచడం ద్వారా మాత్రమే ఈ కొరతను నివారించగలమన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న జిమ్‌సర్ డీన్ డాక్టర్ ఎస్‌పిరావు మాట్లాడుతూ నేత్రదానం ద్వారా మరణించిన తర్వాత కూడా మనుషులు జీవించినట్లుగా భావించవచ్చునన్నారు. దేశంలో నేత్రదానం పట్ల క్రమేపి అవగాహన పెరుగుతోందని తెలిపారు. విశాఖ పరిసర గ్రామాలలో ప్రజలకు పట్టణ ఆరోగ్యకేంద్రాల ద్వారా నేత్రదానం పై ప్రజలలో అవగాహన కల్పిస్తున్నామన్నారు. జిమ్‌సర్ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జ్యోతి పద్మజ, జిమ్‌సర్ నేత్ర విభాగం అధిపతి డాక్టర్ వి.వి.ఎల్.నరసింహారావు, డాక్టర్ వీణా, డాక్టర్ రావినయిని, డాక్టర్ రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

రహదారి బాగు కోసం ప్రజాప్రతినిధులు అధికారులను ఆశ్రయించడం విచిత్రం

మాడుగుల నియోజకవర్గ టీడీపీ నాయకులు పైలా ప్రసాదరావు

విశాలాంధ్ర – వి. మాడుగుల: ఘాట్ రోడ్డు జంక్షన్ నుంచి కింతలి వరకూ రహదారి బాగు చేయాలని వైసిపి చెందిన మాడుగుల మండల ప్రజాప్రతినిధులు అధికార్లను ఆశ్రయించడం విచిత్రంగా వుందని మాడుగుల నియోజకవర్గ తెలుగుదేశం నాయకులు పైలా ప్రసాదరావు అన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ సొంత పార్టీ లీడర్లే అధికార్లను ఆశ్రయించడంపై ప్రజలంతా నియోజకవర్గంలో మంత్రి బూడి ముత్యాలనాయుడు తీరుపై చర్చించుకుంటు న్నారన్నారు. బూడి ముత్యాల నాయుడు గ్రామీణాభివృద్ధి, పంచాయితీరాజ్ వంటి కీలక శాఖల మంత్రి హెూదాలో ఏమీ చేయలేదని నాలుగేళ్ళు గడిచాక అయినా మాడుగుల వైకాపా నాయకులు గుర్తించినందుకు అభినందనలు తెలిపారు. మొదట్లోనే మంత్రి ధోరణి గుర్తించి అడిగి వుంటే ఇంతటి నిరంకుశ ధోరణి పెరిగేది కాదేమో అని అన్నారు. మాడుగుల నియోజకవర్గంలో గత నాలుగేళ్ళుగా అరాచకం రాజ్యమేలుతుందన్నారు. దోపిడీ, అక్రమాలను ప్రశ్నించినా, నిలదీసినా వారి పార్టీ నుంచి లీడర్లను ఉసిగొలిపి ఇష్టానుసారం మాట్లాడించడం తప్పితే మార్పు మాత్రం రాలేదని చెప్పారు. నియోజకవర్గంలో అన్ని కాంట్రాక్టు పనులూ మంత్రి బూడి ముత్యాలనాయుడు చేజిక్కించుకుని ఇష్టానుసారం చేస్తున్నారన్నారు. మాడుగుల వైకాపా నేతలు కోరుతున్న ఘాట్ రోడ్డు కింతలి రోడ్డే కాకుండా చోడవరం మాడుగుల రోడ్డు, చీడికాడలో వీరభద్రపేట రోడ్డు, ఇంకా నియోజకవర్గంలో అనేక రోడ్లు అధ్వాన్నంగా తయారయ్యాయన్నారు. గిరిజన గ్రామాల పరిస్థితి అయితే ఇంకా ఘోరంగా ఉందన్నారు. రైవాడ, కోనాం, తాచేరు జలశాయాలకు బడ్జెట్‌లో నిధులు ఇవ్వకపోయినా ఈ పెద్ద మనిషి నోరు మెదపలేదన్నారు. రైతుల కోసం కోల్డ్ స్టోరేజిల ఏర్పాటు విషయాన్ని కోల్డ్ స్టోరేజిలో దాచేశారని విమర్శించారు. గోవాడ సుగర్స్ పాత బకాయిలను రైతులకు చెల్లించలేదని, పెదకోట హైడ్రో ప్రాజెక్టుతో రైవాడ రైతుల నోట్లో మట్టి కొట్టే పన్నాగం చేస్తున్నా మంత్రి సైలెంట్‌గా ఉన్నారని విమర్శించారు. సమస్యల పరిష్కారంలో వైకాపా పెద్దల అలసత్వాన్ని, వారి స్వార్థ పూరితమైన చర్యలను మాడుగుల నియోజకవర్గ ప్రజలు ఎప్పుడో గుర్తించారన్నారు. తెలుగుదేశం పార్టీతోనే భవిష్యత్తుకు గ్యారంటీ ఉంటుందని విశ్వాసంతో ఉన్నారని ప్రసాదరావు అన్నారు.

వాడుక భాష పితామహుడు గిడుగు రామమూర్తి

విశాలాంధ్ర బ్యూరో – అనకాపల్లి: గిడుగు వెంకట రామమూర్తి తెలుగు వాడుక భాషను వచనను అమలులోనికి తీసుకువచ్చిన సంస్కర్త అని జిల్లా కలెక్టర్ రవి పట్టన్ శెట్టి కొనియాడారు. గిడుగు రామ్మూర్తి జన్మదినాన్ని తెలుగు భాషా దినోత్సవంగా జరుపుకుంటున్నామన్నారు. మంగళవారం కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన గిడుగు చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కలెక్టర్ మాట్లాడుతూ. గ్రాంథికభాషలో ఉన్న తెలుగు వచనాన్ని ప్రజల వాడుకభాషలోకి తీసుకు రావడానికి కృషి చేశారన్నారు. ఆయన స్ఫూర్తితో ప్రభుత్వ కార్యాలయాల్లో ఉత్తర ప్రత్యుత్తరాలన్నీ తెలుగు భాష లోనే నిర్వహించాలని ఆదేశాలిచ్చారు. ఈ రోజుల్లో అక్షరాస్యత పెరిగేందుకు, విద్య, పత్రికల ద్వారా లోకజ్ఞానం, వివిధ శాస్త్రాల విజ్ఞాన విషయాలు తెలుసుకునేందుకు వాడుక భాష ద్వారానే సాధ్యమైందన్నారు. భాషను సరళీకృతం చేసిన అభ్యుదయ వాదిగా అభివర్ణించారు. పరిపాలన అధికారి ఏ. శ్రీనివాసరావు మాట్లాడుతూ. గిడుగు రామ్మూర్తి మనకు అందించిన వాడుక భాషను ఉపయోగిస్తూ తెలుగు భాషను మరింత అభివృద్ధి చేసేందుకు మనం కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ కార్యాలయం, వివిధ శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

కొమ్మది: మధురవాడ బక్కన్న పాలెం రోడ్‌లో ఉన్న శ్రీ చైతన్య ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో తెలుగు భాష దినోత్సవ వేడుకలను, జాతీయ క్రీడా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. వ్యావహారిక భాషా ఉద్యమ పితామహుడు గిడుగు వేంకట రామమూర్తి పంతుల జయంతిని పురస్కరించుకొని ఈ వేడుకలను నిర్వహించారు. పాఠశాల ప్రిన్సిపల్ సందీప్ జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని మొదలుపెట్టారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు మానసిక పరిపక్వత చెందాలంటే తప్పనిసరిగా మాతృభాష దోహదపడుతుందన్నారు. కార్యక్రవంలో ఉత్తరాంధ్ర శ్రీ చైతన్య పాఠశాలల ఏజీఎం సురేష్, రీజనల్ ఇన్చార్జ్ అహ్మద్ అలీ, జోనల్ కో-ఆర్డినేటర్ రాజేష్, వైస్ ప్రిన్సిపల్ ఉమామహేశ్వర రావు, డీన్ ఢిల్లేశ్వరరావు, సి- బ్యాచ్ ఇన్చార్జ్ సాయిరాం, ప్రైమరీ ఇన్చార్జ్ దుర్గా పాల్గొన్నారు.

మాలతాంబ విద్యానికేతన్‌లో కార్ షెడ్, అంతర్జాతీయ క్రికెట్ స్టేడియం చేరువలో గల మాలతాంబ విద్యానికేతన్ లో మంగళవారం తెలుగు భాషాదినోత్సవం, ఓనం, జాతీయ క్రీడాదినోత్సవం వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా గిడుగు వెంకట రామమూర్తి పంతులు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. పాఠశాల ప్రిన్సిపాల్ ఎ.ఆదిమూర్తి, వైస్-ప్రిన్సిపాల్ బి.శ్రీదేవి పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమంలో తెలుగు భాష గొప్పతనాన్ని, ప్రాధాన్యతను విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎ.ఆదిమూర్తి తదితరులు పాల్గొన్నారు.

కూర్మన్నపాలెం: అగనంపూడి పునరావాస కాలనీ చట్టివానిపాలెం గ్రంథాలయంలో తెలుగు భాష దినోత్సవం సందర్భంగా కళా ప్రపూర్ణ గిడుగు వెంకట రామమూర్తి జయంతి ని పురస్కరించుకొని ముఖ్యఅతిథి గాజువాక మండల విద్యాశాఖ అధికారి ఎం సునీత ఆయన చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. తెలుగువారు ఎంత ఉన్నత ఉన్నత చదువు చదివినప్పటికీ మన మాతృభాష అయినా తెలుగు నేర్చుకోవాలని పిల్లలకి చిన్ననాటి నుండి పెద్దలు నేర్పాలని అన్నారు. కార్యక్రమంలో ఏడీసీ చైర్మన్ బలరెడ్డి సత్యనారాయణ, ఎం సునీత, పితాంబరం రంగాచార్యులు, చట్టివానిపాలెం గ్రంథాలయం గౌరవ అధ్యక్షులు ముచ్చు అప్పలరాజు, వైఎస్సార్‌సీపీ నాయకులు ఎదురు వెంకట అప్పారావు, టిడిపి నాయకులు నెల్లి శ్రీనివాసరావు, బండారు చందు, రమేష్, బిజెపి నాయకులు కోసూరు తాతారావు, అంగుశూరి ఈశ్వరరావు, జనసేన పార్టీ నాయకులు బుదిరెడ్డి అప్పారావు, రాష్ట్ర కాంగ్రెస్ కార్మిక విభాగం ప్రధాన కార్యదర్శి దానబోయిన అప్పలనాయుడు, ఈపీసీ కన్వీనర్ దానబాల పైడికొండ, నోటరీ కౌన్సిలింగ్ ప్రముఖ న్యాయవాది బి శ్రీనివాసరావు, విశాఖ లైన్స్ క్లబ్ చైర్ పర్సన్ కడిమి హనుమంతరావు, స్థానిక నాయకులు డి సీతారాములు, చెట్టి అప్పలనాయుడు, బి.అప్పలరాజు, చట్టి చిన్నారావు, మహిళా మండలి నాయకురాలు చట్టి వరలక్ష్మి, వల్లా సత్యవతి పాల్గొన్నారు.

చింతూరు: చింతూరులోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తెలుగు విభాగం, జాతీయ సేవా విభాగం ఆధ్వర్యంలో గిడుగు రామ్మూర్తి పంతులు జయంతి సందర్భంగా "తెలుగు భాషా దినోత్సవం" ఘనంగా నిర్వహించారు. తొలుత గిడుగు రామ్మూర్తి పంతులు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తెలుగు శాఖధిపతి కె శ్రీదేవి గిడుగు రామ్మూర్తి పంతులు జీవిత చరిత్రను వివరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె రత్న మాణిక్యం మాట్లాడుతూ గిడుగు రామ్మూర్తి పంతులుగారు వ్యవహారిక తెలుగు భాష కోసం ఎనలేని కృషి చేశారన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ ముల్లి శేఖర్, అధ్యాపకులు జి వెంకటరావు, డాక్టర్ వై పద్మ, కె శకుంతల, యస్ అప్పనమ్మ, జి హారతి, సిహెచ్ రాజబాబు,కె శ్రీలక్ష్మి, అలివేలు, గౌతమి, మౌనిక, సాయి కుమార్, సీనయ్య తదితర విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

రావికమతం: తెలుగు భాషా దినోత్సవం, జాతీయ క్రీడా దినోత్సవం కొత్తకోట పెంటపాటి సూర్యారావు మెమోరియల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం అత్యంత వైభవముగా నిర్వహించారు. ఈ సందర్భంగా గత సంవత్సరం 2022- 23 లో 10వ తరగతి తెలుగులో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన 20 మంది విద్యార్థులను సత్కరించడం జరిగింది. అలాగే గత సంవత్సరం పబ్లిక్ పరీక్షలో దివ్యాంగ విద్యార్థులకు స్క్రైబ్ గా సేవలందించిన విద్యార్థులు ఐదుగురికి సేవారత్న అవార్డుతో సత్కరించడం జరిగింది. అలాగే ఈ సందర్భంగా వ్యాసరచన, అనర్గళంగా తెలుగు మాట్లాడడంలో నిర్వహించిన పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతి ప్రధానం జరిగింది. అనంతరం విద్యార్థులందరికీ స్వీట్స్ పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రధానో పాధ్యాయులు కుసుమంచి నాగేశ్వరరావు, తెలుగు ఉపాధ్యాయులు గుమ్మడు కన్నయ్య దొర, సుజాత, నిర్మల, వ్యాయామ ఉపాధ్యాయులు వి.రామచంద్రా రెడ్డి పాల్గొన్నారు.

చింతపల్లి: తెలుగు భాషా పితామహుడు గిడుగు రామమూర్తి పంతులు అని విశ్రాంత ఉపాధ్యాయుడు, చింతపల్లి జెడ్పీటీసీ సభ్యుడు పోతురాజు బాలయ్య అన్నారు. గిడుగు రామమూర్తి జయంతిని పురస్కరించుకుని మంగళవారం ఆయన మాట్లాడుతూ గ్రాంధిక భాషలో ఉన్న తెలుగును ప్రజల వాడుక భాషలోకి తీసుకువచ్చిన మహనీయుడు గిడుగు రామమూర్తి పంతులు అన్నారు. వ్యవహారిక భాషలో ఉన్న తియ్యదనాన్ని, సౌలభ్యాన్ని మనకు అందించిన మహానుభావుడన్నారు. ఆంధ్ర రాష్ట్రంలో వ్యవహారిక భాషోద్యమానికి మూల పురుషుడు గిడుగు రామమూర్తి అన్నారు. తెలుగు వ్యవహారిక భాష ఆవశ్యకతను అందరికీ తెలియజేసిన అచ్చ తెలుగు జ్ఞాని గిడుగు అన్నారు. గిడుగు రామమూర్తి వ్యవహారిక భాష అభివృద్ధికి చేసిన కృషిని ఈ సందర్భంగా ఆయన కొనియాడారు.

పద్మనాభం: మండలంలోని మద్ది జిల్లా పరిషత్ హై స్కూల్‌లో మంగళవారం మాతృభాష దినోత్సవ కార్యక్రమం పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలోని మాతృభాషకు సంబంధించిన పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

పెందుర్తి: స్థానిక ఆదర్శ్ డిగ్రీ కళాశాలలో తెలుగు భాషా దినోత్సవం వేడుకలు ఘనంగా నిర్వహించినట్లు ప్రిన్సిపల్ ఎస్ఈ ఫ్లోరా తెలియజేశారు. ఈ వేడుకలను ఆదర్శ డిగ్రీ కళాశాల విద్యార్థినిలు లిమా తెలుగు తల్లికి మల్లెపూదండలి అనే ఆంధ్ర రాష్ట్ర గౌరవనీయ గేయంతో ప్రారంభించారు. తదుపరి విద్యార్థి విద్యార్థినులు తెలుగు భాషా ప్రదర్శనలతో కార్యక్రమాన్ని అలరించారు. తెలుగు పద్యాలు, కావ్యాలతో కళాశాల విద్యార్థిని విద్యార్థులు వారి యొక్క ప్రతిభను కనబరిచారు. ఆదర్శ్ డిగ్రీ

కళాశాల కరస్పాండెంట్ సెక్రెటరీ టీ తియోపిలస్ ఈ కార్యక్రమంలో ప్రసంగిస్తూ తెలుగు భాషలో ఒక పద్యం లేక ఒక శ్లోకం వ్రాయాలంటే ఎన్నో నిబంధనలు ఉంటాయని, తెలుగు భాషా సాహిత్యాన్ని గౌరవించాలన్నారు. ఈ తెలుగు భాషా దినోత్సవం వేడుకల్లో ఆదర్శ్ డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ సెక్రెటరీ టీ తియోపిలస్, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు, ఆదర్శ్ డిగ్రీ కళాశాల అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ రవిబాబు పాల్గొన్నారు. ఆదర్శ్ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు మంజుల, గౌతం బాబు, అచ్చమ్మ ఈ కార్యక్రమంలో పాల్గొని ప్రత్యేకంగా పర్యవేక్షించారు.

పాయకరావుపేట: స్థానిక శాఖా గ్రంథాలయంలో తెలుగు భాషా దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. గ్రంథాలయాధికారి వామాల లక్ష్మణరావు ఆధ్వర్యంలో గిడుగు వెంకట రామ్మూర్తి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈకార్యక్రమంలో ఎ.సీతారామయ్య, ఎన్‌టి సీతారామూర్తి, కాకర కృష్ణ, నాగేశ్వరరావు, అప్పారావు, కుమార్ తదితరులు పాల్గొన్నారు. అలాగే స్థానిక శ్రీచైతన్య టెక్నో స్కూల్‌లో తెలుగు భాషా దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. తెలుగు పండితులు శ్రీపాద సత్యనారాయణ తెలుగు భాషా దినోత్సవం ఆవశ్యకతను వివరించారు. ఈకార్యక్రమంలో విద్యాసంస్థల ఎజిఎం ఎం.వి.సురేష్, ఆర్ఐ గోపినాథ్, ప్రిన్సిపాల్, మాణిక్యాలరావు, డీన్ విజయ్, అప్పలరాజు, వెంకటేష్, గోవిందరావు, మాలతి, అనూష, కామాక్షి, వేణుప్రియ తదితరులు పాల్గొన్నారు.